# పొల్గీ రైతులు 100 నామినేషన్లు!



కామారెడ్డి, నవంబర్ 3 : కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌పై పోటీకి 100 నామినేషన్లు వేస్తామ ని పొల్గీ రైతులు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో పొల్గీ రైతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఆత్మీయ సమ్మేళనంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఓన్ ఫార్మర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రావు, ఇంటిగ్రేటెడ్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరోపక్క ఇప్పటికే కాయితీ లంబాడీలు 1,016 నామినేషన్లు వేస్తామని ప్రకటించారు.

# 7,11 తేదీల్లో తెలంగాణకు ప్రధాని మోడీ



హైదరాబాద్, నవంబర్ 3 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 7 , 11 తేదీల్లో ప్రధా ని నరేంద్ర మోడీ తెలంగాణకు రానున్నారు. 7న బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్ లో 'బీసీల ఆత్మగౌరవ సదస్సు' జరగనుంది. 11న సికింద్రాబా ద్ పరేడ్ గ్రౌండ్‌లో మాదిగ ఉప కులాల 'విశ్వరూప మహాసభ' జరగనుంది. ఈ రెండు సభలకు చీఫ్ గెస్టుగా మోదీ రానున్నారు.రోరోల వ్యవధిలో ప్రధాని 2 సార్లు హైదరాబాద్ కు రానుం డడంతో ఆయన సభ ఏర్పాట్లపై రాష్ట్ర నాయక త్వం దృష్టి పెట్టింది. దాదాపు నెల రోజుల తర్వాత ప్రధాని మళ్లీ ఎన్నిక ల ప్రచార సభలో పాల్గొనేందుకు రాష్టా నికి వస్తున్నారు. మోదీ తెలంగాణ టూర్ షెడ్యూల్ ను ఖరారు చేసే పనిలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఉన్నారు.

# బడంగ్‌పేట మేయర్ పారిజాత నరసింహా రెడ్డి ఇంట్లో ముగిసిన ఐటీ సోదాలు



హైదరాబాద్,నవంబర్3 : బడంగ్‌పేట మేయర్ పారిజాత నరసింహా రెడ్డి ఇంట్లో ఐటీ సోదాలు ముగిశాయి. నగదు, పలు కీలక పత్రాలను అధికారులు తీసుకెళ్లారు. పారిజాతతోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇండ్లపై ఐటీ అధికారులు గురువారం ఉదయం నుంచి తనిఖీలు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, పారిజాత ఇంటి నుంచి అధికారులు అర్ధరాత్రి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా రూ.8 లక్షల నగదు, కొన్ని పత్రాలు తీసుకెళ్లినట్లు తెలుస్తున్నది. అదేవిధంగా ఈ నెల 6న ఐటీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు జారీచేశారు. వ్యాపార లావాదేవీలకు పన్ను ఎగవేత జరిగినట్లు ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు. ఆమె మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేయాలనుకున్న విషయం తెలిసిందే. కాగా, హహేశ్వంరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి నివాసంతోపాటు, రిలయ్ ఎస్టేట్ ఆఫీసుల్లో సోదాలు నిర్వహించారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీప బంధువు, రియల్టర్ గిరిధర్ రెడ్డి ఇండ్లపై కూడా దాడులు జరిగాయి. ఇక కేఎల్‌ఆర్ ఇంట్లో ఐటీ అధికారులు మరోసారి సోదాలు నిర్వహిస్తున్నారు.

# పేద, మధ్యతరగతి ప్రజలకు బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో భరోసా : మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యపేట,నవంబర్3 : పేద, మధ్యతరగతి ప్రజలకు బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో భరోసా అని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అని చెప్పారు. ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సూర్యాపేటలో తన సతీమణి సునితతో కలిసి మంత్రి జగదీశ్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో బీఆర్‌ఎస్‌కు వేసిన ఓటు కోట్లాది రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని చెప్పారు. కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా అని, అన్నపూర్ణ పథకం, ఆసరా పెన్షన్ల పెంపు, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్, రైతుబంధు రూ.16 వేలు, అగ్రవర్ణ పేదలకు గురుకులాలు, కేసీఆర్ ఆరోగ్యరక్షకు రూ.15 లక్షలు, సౌభాగ్యలక్ష్మి రూ.3 వేలు, మహిళలకు జీవనభృతి, రూ.4 వందలకే గ్యాస్ సిలిండర్, మహిళా సమాఖ్యలకు సొంత భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు.

# ఎన్నికలకు నోటిఫికేషన్‌ను విడుదల




హైదరాబాద్,నవంబర్3 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. దీంతో నామినేషన్ల ప్రక్రియ కూడా షురూ అయింది. ఈ నెల 10 వరకు నామపత్రాలను స్వీకరిస్తారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. నామినేషన్లను ఆన్‌లైన్‌లో పూర్తిచేసి ఆ దరఖాస్తును రిటర్నింగ్ అధికారికి భౌతికంగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ నెల 13న నామినేషన్లను పరిశీలిస్తారు. 15 వరకు ఉపసంహరణకు గడువు విధించారు. అదేరోజు సాయంత్రం అభ్యర్థుల తుదిజాబితాను ప్రకటిస్తారు. రాష్ట్రంలోని 119 నియో జకవర్గాలకు ఈ నెల 30న పోలింగ్ జరుగనుండగా.. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరుగనుంది. పోలింగ్ ప్రక్రియ మొత్తం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల ద్వారా నిర్వహించనున్నారు. కాగా, నామినేషన్ల సమయంలో అభ్యర్థులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని ఈసీ స్పష్టం చేసింది. ఒక్కో అభ్యర్థి ఒక్కో నియోజకవర్గం నుంచి గరిష్టంగా నాలుగుసెట్ల నామినేషన్లు వేయవచ్చు. ఒక అభ్యర్థి రెండుకు మించి నియోజకవర్గాల్లో పోటీ చేయకూడదు.

# ఆ నాడు ఇచ్చిన మాటకే గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్నా : ఈటల రాజేందర్

సిద్దిపేట,నవంబర్3 : గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని తిగుల్ నర్సాపూర్ గ్రామంలో శ్రీ కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. దమ్ముంటే రాజీనామా చేసి గెలిచి చూపించాలని కేసీఆర్ అంటే.. రాజీనామా చేసి గెలిచి చూపించానన్నారు. హుజురాబాద్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధర్మ యుద్ధం చేస్తే ఆ యుద్ధంలో ధర్మం గెలిచిందని.. తాను కూడా గెలిచానన్నారు. ఆనాడు గజ్వేల్‌లో మీ మీద పోటీ చేస్తానని చెప్పిన విధంగానే ఈరోజు మీపై పోటీకి దిగానన్నారు. కేసీఆర్ వేల కోట్లు ఖర్చుపెట్టినా కూడా మీకు స్వచ్ఛందంగా ఓట్లు వేసి గెలిపించుకుంటామని గజ్వేల్ ప్రజలు ఆశీర్వదిస్తున్నారని ఈటల పేర్కొన్నారు.

# అభివృద్ధికికే పట్టం కట్టండి : తలసాని శ్రీనివాస్‌యాదవ్



హైదరాబాద్,నవంబర్3 : అభివృద్ధికి మారుపేరుగా ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) కే ప్రజలు మరో అవకాశం ఇవ్వాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శుక్రవారం మధ్యాహ్నం మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి.. తెలంగాణ రాష్ట్రంలో, హైదరాబాద్ నగరంలో బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి గురించి వెల్లడించారు. హైదరాబాద్ అభివృద్ధి కళ్ల ముందే కనిపిస్తున్నదని చెప్పారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పాత్ర ఎంతో ఉన్నదని మంత్రి తలసాని తెలిపారు. జనం ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో హాయిగా బతుకుతున్నరని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర సర్కారు చిన్న చూపు చూస్తున్నదని ఆరోపించారు. అయినా తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో అద్భుత కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. దేశంలో 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తలసాని చెప్పారు. మరే రాష్ట్రంలోనూ 24 గంటల కరెంటు లేదని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొంటున్నదని మంత్రి చెప్పారు. ఆడపిల్ల పెళ్లికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమని మంత్ర పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి బీఆర్‌ఎస్ సర్కారు అనేక పథకాలను తీసుకొచ్చిందని మంత్రి తెలిపారు. ఐటీ రంగంలో కూడా రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని చెప్పారు. కరోనా కాలంలో వలస కార్మికులను తమ ప్రభుత్వం ఆదుకున్నదని మంత్రి తలసాని గుర్తు చేశారు.

# ముదిరాజ్‌ల నుంచి ఈటల ఎవరనీ ఎదగనివ్వలే

- కాసాని జ్ఞానేశ్వర్‌కు అవకాశాలు మెండుగా ఉంటాయి
- ఏదో తమాషాకు అభ్యర్థులను బరిలో దింపే పార్టీ మాది కాదు : సిఎం కెసిఆర్



హైదరాబాద్,నవంబర్3 : ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి ఈటల రాజేందర్ ఎవ్వరిని ఎదగనివ్వలేదు అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బండా ప్రకాశ్ ముదిరాజ్ లాంటి వాళ్లను పార్టీలోకి తీసుకొచ్చి పదవులు ఇచ్చామని, కాసాని జ్ఞానేశ్వర్‌కు అవకాశాలు ఉంటాయని కేసీఆర్ పేర్కొన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను సీఎం కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానించి, గులాబీ కండువా కప్పారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన బండా ప్రకాశ్‌ను ఎంపీ చేసుకున్నాం. ఆ తర్వాత ఎమ్మెల్సీ చేసుకున్నాం. ఇప్పుడు మండలి వైస్ చైర్మన్‌గా నియమించుకున్నాం. మీకు రాజకీయాలు తెలుసు.. మనకున్నవి మొత్తం 119 సీట్లు.. అందులో ఏడు మనవి కావు. మన కున్నది కేవలం 112 సీట్లు. ఆ సీట్లలో పెట్టిన వ్యక్తి పక్కా గెలవాలి. ఏదో తమాషాకు అభ్యర్థిని బరిలో దింపి, ఆ సీటును కోల్పోయి, పార్టీకి నష్టం చేకూర్చేవడం రాజకీయం కాదు. ఎన్నికల తర్వాత హైదరాబాద్‌లో అందరం కలిసి కూర్చుందాం. ఎన్టీ రామారావు పీరియడ్‌లో లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేసి సాధించాం. దాంతో కొంత మంది రాజకీయ నాయకులు ఎదిగారు. రాజకీయంగా రాబోయే రోజుల్లో చాలా పదవులు ఉంటాయి. చాలా అవకాశాలు ఉంటాయి. ముదిరాజ్ సామాజిక వర్గం పెద్దది కాబట్టి ఆ వర్గం నుంచి మనం నాయకులను తయారు చేసుకోవాలి. జిల్లాకు ఒకరిద్దరిని తయారు చేసుకుంటే పార్లమెంట్‌కు పెట్టుకోవచ్చు.. అసెంబ్లీకి పెట్టుకోవచ్చు. ఎమ్మెల్సీలు కూడా కావొచ్చు.. అలా చాలా అవకాశాలు ఉంటాయి. రాజేందర్ అటు పోయినా.. పెద్ద మనిషి కాసాని జ్ఞానేశ్వర్ పార్టీలో చేరడం మంచి పరిణామం అని సీఎం కేసీఆర్ అన్నారు.

# ముగిసిన రాజశ్యామలా సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగం



సిద్దిపేట,నవంబర్3 : ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో విశాఖ శ్రీ శారదాపీఠం చేపట్టిన రాజశ్యామలా సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగం ముగిసింది. వైదిక నియమాలను అనుసరిస్తూ మూడు రోజులపాటు యాగాన్ని నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం మహా పూర్ణాహుతితో యాగ క్రతువు పూర్తయింది. తెలంగాణ ప్రజలందరినీ రాజశ్యామల అమ్మవారు అనుగ్రహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ యాగాన్ని నిర్వహించారని పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కంకణం కట్టుకున్న నాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. సశాస్త్రీయంగా యాగాన్ని పూర్తి చేసామని స్పష్టం చేసారు. ఈ యాగంతో తెలంగాణలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం అవుతుందని చెప్పారు. మహా పూర్ణాహుతి అనంతరం యాగంలో మంత్రించిన జలాలను కేసీఆర్ దంపతులపై చల్లారు. యాగ భస్మాన్ని కేసీఆర్ నుదుట దిద్దారు. యాగశాలలో రాజశ్యామల అమ్మవారు శుక్రవారం నర్తనకాళి అలంకరణలో దర్శనమిచ్చింది. వేకువజాము నుంచే రాజశ్యామల, సుబ్రహ్మణ్యేశ్వర మూల మంత్రాల హవనం ప్రారంభమైంది. పూర్ణాహుతి ముహూర్త సమయానికి నిర్దిష్ట సంఖ్యలో హవనాలను పూర్తి చేసారు. మహా పూర్ణాహుతిలో కేసీఆర్ దంపతులతో పాటు బంధుమిత్రులు, సన్నిహితులు పాల్గొన్నారు. పూర్ణాహుతిలో వినియోగించే పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలకు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర సమక్షంలో కేసీఆర్ దంపతులు పూజలు చేసారు. అష్టదిక్పాలకులకు ఆర్ఘ్యం సమర్పించారు. అనంతరం పూర్ణాహుతి జరిపారు. కేసీఆర్ దంపతులు ధరించిన కంకణాలను విసర్జించడం ద్వారా యాగం పూర్తయింది. సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదిస్తున్న స్వరూపానందేంద్ర స్వామి అనంతరం స్వరూపానందేంద్ర స్వామికి పాదపూజ చేసి కేసీఆర్ పుష్పాభిషేకంతో గురు వందనం సమర్పించారు. ఈ సందర్భంగా శూలినీ దుర్గ కవచంతో అభిమంత్రించిన రక్షను స్వరూపానందేంద్ర స్వామి కేసీఆర్‌కు కట్టారు. అలాగే విశాఖ శ్రీ శారదాపీఠం నుండి ప్రత్యేకంగా రప్పించిన రాజశ్యామల అమ్మవారి శేష వస్త్రాలను స్వరూపానందేంద్ర స్వామి కేసీఆర్ దంపతులకు అందించారు. శుభానికి సూచికగా పండితులంతా పసుపు వస్త్రాలను ధరించి యాగానికి హాజరయ్యారు.

# గట్టిగా రంగంలోకి దిగితే జగ్గారెడ్డి పారిపోతాడు : మంత్రి హరీశ్‌రావు



సంగారెడ్డి,నవంబర్3 : కాంగ్రెస్, బీజేపీలపై మంత్రి హరీష్‌రావు విమర్శల వర్షం కురిపించారు. సంగారెడ్డిలో పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను భారీ మెజారిటీతో గెలిచించాలని కోరారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే.. 'ఖర్గే సంగారెడ్డికి వస్తే ఆయన బహిరంగసభకు ఇప్పుడు మన పార్టీ మీటింగ్‌కు వచ్చిన కార్యకర్తలంత మంది గూడా రాలేరు. అది మన బలం. మనం గట్టిగ కార్యరంగంలోకి దిగితే జగ్గారెడ్డి గాల్లో కొట్టుకుపోతడు. సంగారెడ్డిలో అభివృద్ధి కొనసాగాలంటే గులాబీ జెండా ఎగరాలె. ఇటీవల రాష్ట్రంల కొన్ని సర్వేలు వచ్చినయ్. ఆ సర్వేలు హ్యాట్రిక్ సీఎం కేసీఆరే అని చెప్పినయ్. సంగారెడ్డిలో గులాబీ జెండా ఉంటే అభివృద్ధిలో దూసుకుపోవచ్చు' అని చెప్పారు. 'జగ్గారెడ్డి గత ఎన్నికలప్పుడు మందుతాగి సత్తనని చెప్పి ఓట్లు దండుకున్నడు. గల్లీకి ఒక ఏటీఎం పెడుత, ఇంటికో కార్డు ఇస్త, ఎన్ని పైసలు కావాలంటే అన్ని డ్రా చేసుకోవచ్చు అని చెప్పిండు. మరి ఏటీఎంలు పెట్టిండ్రా..? కార్డులు వచ్చినయా..? ఇండ్లు వస్తయన్నడు, ప్లాట్లు వస్తయన్నడు. వచ్చినయా..? ఒక్క పనన్న జరిగిందా..? ఈ ఐదేళ్లలో జగ్గారెడ్డి కనీసం ఒక్కసారి కూడా పోని ఊర్లు నియోజకవర్గంలో ఎన్నో ఉన్నయ్. కరోనా వచ్చినప్పుడు పోలే, మంచికి పోలే, చెడుకు పోలే. సంగారెడ్డి ప్రజలకు ఇప్పుడు జగ్గారెడ్డి సంగతి అర్థమయ్యింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌రెడ్డిని గత ఎన్నికల్లో ఓడించినా కష్టకాలంలో ప్రజలకు అండగా ఉన్నడు. రెమిడిస్‌వేర్ ఇంజక్షన్‌లు తెప్పించి ప్రజలను కాపాడిండు. ప్రజలకు కరోనా సందర్భంగా ఎన్నో కిట్లు ఇచ్చిండు. గెలిచిన జగ్గారెడ్డి పత్తాలేకుండా పోయినా ఓడిన చింతా ప్రభాకర్ మాత్రం ప్రజల మధ్య ఉన్నడు' అని మంత్రి ప్రశంసించారు. 'మన సీఎం కేసీఆర్ రూ.570 కోట్లతో సంగారెడ్డికి మెడికల్ కాలేజీ ఇచ్చిండు. నర్సింగ్ కాలేజీ ఇచ్చిండు. ఇయ్యాల సంగారెడ్డి పట్టణంలో, సదాశివపేట పట్టణంలో ఎన్ని అభివృద్ధి పనులు జరిగినయో మీకందరికీ తెలుసు. జగ్గారెడ్డి తెలంగాణ ద్రోహి. నాడు సంగారెడ్డిని కర్ణాటకల కలపాలన్నడు. తెలంగాణ రాష్ట్రం వద్దంటే వద్దన్నడు. తెలంగాణ వ్యతిరేకులతోటి చేతులు కలిపిండు. తెలంగాణ ద్రోహులు పవన్ కళ్యాణ్, వైఎస్ శర్మిలతోటి బీజేపీ, కాంగ్రెస్ అంటకాగుతున్నయ్. బీజేపీతోటి పవన్ కళ్యాణ్ చేతులు కలుపుతున్నడు. కాంగ్రెస్‌తోటి శర్మిల చేతులు కలుపుతున్నది. చంద్రబాబు నాయుడు తెలంగాణలో పోటీ చేయకుండా లోపాయికారిగా బీజేపీకి, కాంగ్రెస్‌కు సహకరిస్తున్నడు. ఇప్పుడు తెలంగాణ ద్రోహులంతా కాంగ్రెస్, బీజేపీ ముసుగులో ఒక్కటయ్యిండ్రు. ఈ ద్రోహులతో మనం జాగ్రత్తగా ఉండాలి. లేదంటే తెలంగాణ ఆగమైతది' అని మంత్రి హరీష్‌రావు హెచ్చరించాడు.

# కల్లు కంపౌండ్లపై నార్కోటిక్ బ్యూరో దాడులు

హైదరాబాద్, నవంబర్3 : హైదరాబాద్ వ్యాప్తంగా కల్లు కంపౌండ్లపై నార్కోటిక్ బ్యూరో దాడులు నిర్వహిస్తోంది. 69 కల్లు కంపౌండ్లను నార్కోటిక్ బ్యూరో సీజ్ చేసింది. కృత్రిమ కల్లును తయారు చేసి విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో అధికారులు ఈ దాడులు నిర్వహించారు. అల్ఫాజోలం, నిమ్మ ఉప్పు, మినప్పిండితో కృత్రిమ కల్లు తయారు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. పోలీసులు, నార్కోటిక్ బ్యూరో సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. కల్లు కం పౌండ్లలో సేకరించిన శాంపిల్స్‌ను అధికా రులు ల్యాబ్‌కు పంపించారు. కృత్రిమ కల్లుపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావటంతో సోదాలు జరిపారు.

# 6 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఎంఐఎం

హైదరాబాద్,నవంబర్3 : తెలంగాణలో జరగబోయే ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ తరపున పోటీ చేయనున్న అభ్యర్థులను ప్రకటించింది. 9 స్థానాల్లో పోటీ చేయనున్న ఎంఐఎం.. 6 అభ్యర్థుల వివరాలను వెల్లడించింది. బహదూర్‌పూరా, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఇంకా ప్రకటించాల్సి ఉంది. తెలంగాణలో జరగబోయే ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ 9 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇవాళ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ పోటీ చేసే అభ్యర్థుల వివరాలను వెల్లడించారు. చంద్రాయణ గుట్ట నుంచి అక్బరుద్దీన్ ఓవైసీ, నాంపల్లి నుంచి మాజీద్ హుస్సేన్, చార్మినార్ నుంచి మాజీ మేయర్ జుల్ఫికర్, యాకత్?పురా నుంచి జాఫర్ హుస్సేన్ మిరాజ్ పోటీ చేయనున్నారు. మలక్‌పేట నుంచి అహ్మద్ బలాల, కార్వాన్ నుంచి కౌసర్ మొయినుద్దీన్ పోటీ చేస్తారని తెలిపారు. బహదూర్‌పూరా, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోయే అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఒకటి రెండు రోజుల్లో ప్రచారం ప్రారంభిస్తామని అసదుద్దీన్ ఓవైసీ తెలిపారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలైనా పాషా ఖాద్రీ, ముంతాజ్ హేమంత్ ఖాన్ ఈసారి ఎన్నికల బరిలో నిలబడటం లేదని తెలిపారు. తాము పోటీ చేయబోయే ప్రతి స్థానంలో గెలుస్తామని ఆశా భావం వ్యక్తం చేశారు. 'బీజేపీ, కాంగ్రెస్ నేతలు అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. తమవి లౌకిక పార్టీలని బీజేపీ, కాంగ్రెస్ నేతలు అబద్ధం చెబుతున్నారు. బాబ్రీ మసీదు విషయంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర అందరికీ తెలుసు. బాబ్రీ మసీదు ఘటనలో ఒక్క కాంగ్రెస్ నేతకూ శిక్ష పడలేదు. రాహుల్‌గాంధీ కమలానాథ్.. నాటకాలు ఆడుతున్నారు. భారత్ జోడో పేరుతో రాహుల్‌గాంధీ అబద్ధాలు చెబుతున్నారు. 60 ఏళ్లుగా దేశంలో, రాష్ట్రాల్లో పరిపాలన చేసింది కాంగ్రెస్ కాదా?'. అని అసదుద్దీన్? ఓవైసీ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్?పై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏడాది జనవరిలో అయోధ్య మందిర ప్రారంభ కార్యక్రమానికి ప్రధానీ మోదీ వెంట కాంగ్రెస్ నేత రాహుల్? గాంధీని తీసుకెళ్లాలను డిమాండ్ చేశారు. బాబ్రీ మసీదు మొత్తం అంశంలో బీజేపీ కాంగ్రెస్?ల పాత్ర ఉందని ఆరోపించారు. కాంగ్రెస్? హయాంలో అనేక సార్లు కర్ఫ్యూ విధించారని మండిపడ్డారు. 1990 నుంచి 2012 వరకు 113 సార్లు కర్ఫ్యూలు విధించారని పేర్కొన్నారు.

# అభివృద్ధి అంటేనే కేరాఫ్ బిఆర్ఎస్



బాసర ఆలయం అభివృద్ధికి రూ. 50 కోట్లు మంజూరు చేశాం

ముథోల్,నవంబర్3 : అభివృద్ధికి కేరాఫ్‌గా బిఆర్‌ఎస్ పార్టీ నిలిచిందని మళ్లీ అధికారంలోకి రాగానే మరింత అభివృద్ధి సాధిస్తామని బాసర సరస్వతి దేవి కొలువైన ఈ పుణ్యభూమికి శిరస్సు వంచి నమసరిస్తున్నాను అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ముథోల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో పార్టీ అభ్యర్థి విఠల్ రెడ్డికి మద్దతుగా కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలో గతంలో ఎప్పుడూ కూడా గోదావరి పుష్కరాలు జరగలేదు అని కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన తర్వాత, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బ్రహ్మాండంగా పుష్కరాలు జరుపుకుంటున్నాం. ఆ విషయం మీ అందరికీ తెలుసు. బాసర ఆలయం అభివృద్ధికి రూ. 50 కోట్లు మంజూరు చేశాం.ఆ పనులు జరుగుతున్నాయి. ఇంకా అవసరమతై మరిన్ని నిధులు మంజూరు చేస్తాను అని కేసీఆర్ హామీ ఇచ్చారు. బీడీ కార్మికులు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నారని కేసీఆర్ గుర్తు చేశారు. దేశంలో 19 రాష్ట్రాల్లో బీడీ కార్మికులు ఉన్నారు. ఆ రాష్ట్రాల్లో పెన్షన్ లేదు. మన దగ్గరనే బీడీ కార్మికులకు పెన్షన్ ఉంది. పెన్షన్లు పెంచుతాం. కొత్తవారికి కూడా ఇస్తాం. బీడీ కార్మికులకు కాదు.. టేకేదార్లు, ప్యాకింగ్ చేసేవారికి మంజూరు చేశాం. అందరికీ సహాయం జరుగుతుంది. బీఆర్‌ఎస్ పార్టీ గెలిస్తేనే తెలంగాణ ముందుకు పోతది. దయచేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించి విఠల్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.

# 3వేల కోట్లతో ఆర్మూర్ అభివృద్ధి

## సిఎం కెసిఆర్ సభలో జీవన్ రెడ్డి వెల్లడి



ఆర్మూర్,నవంబర్3 : గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 3 వేల కోట్ల రూపాయలతో కనీవినీ ఎరగని రీతిలో ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది అని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్మూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు ఆర్మూర్ ఎంతో వెనుకబడి ఉండేది.బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ అడిగిన వెంటనే నిధులు కేటాయించి అభివృద్ధిని పరుగులు పెట్టించారన్నారు. ఆర్మూర్ వెనుకబడింది అంటే ఒక్క జీవోతో 72 పథకాలు మంజూరు చేసిన మనసున్న మారాజు సీఎం కేసీఆర్ అని ప్రశంసించారు. సిద్ధుల గుట్ట ఘాట్ రోడ్డుకు రూ.20 కోట్లు కేటాయించారు.అలాగే వంద పడకల దవాఖానను కేటాయించారు, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, రూ.500 కోట్లతో సాగు, తాగు నీటి గోస తీర్చి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బండి సంజయ్ ఎంపిగా ఏం చేసిండు

## ఏనాడైనా వచ్చి కనీసం పలకరించాడా

## ప్రచారంలో మంత్రి గంగుల కమలాకర్ విమర్శలు



కరీంనగర్,నవంబర్3 : యాభై ఏండ్లుగా తెలంగాణకు రోడ్లు, నీళ్లు, కరెంటు తేని మోసగాళ్ల పార్టీలు కాంగ్రెస్, బీజేపీ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలం నాగుల మల్యాల గ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. గ్రామస్థులు గంగుల కు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర చేసి ఇంటింటికి తిరుగుతూ ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతిల్లో పెట్టకండి, తెలంగాణను మరింత అభివృద్ధి చేసుకోవడానికి కేసీఆర్ చేతుల్లో పెట్టాలని ఆయన కోరారు. గతంలో మన తాతలు ఆంధ్రలో కలపడం వల్ల 60ఏండ్లు అరిగోస పడ్డామని, అరవై ఏళ్లు వెనకబాటుకు గురయ్యామని, ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీలకు ఓటేసి అదే తప్పును మళ్లీ మనం చేయొద్దని వేడుకున్నారు. గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి తర్వాత ఎంపీగా గెలిపించారు. కానీ ఏనాడైనా మీ సమస్యల కోసం మీ దగ్గరికి వచ్చారా అని ప్రశ్నించారు. మళ్లీ నేడు ఓట్లకోసం వస్తున్నాడని, ఇలాంటి వాళ్లపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనునిత్యం అందుబాటులో ఉంటూ స్థానికంగా నీళ్లు, కరెంటు తెచ్చి రోడ్లు వేయించి, వాటి రిపేర్లను సైతం చేయిస్తూ మీ సేవ చేస్తున్న వ్యక్తిగా మరోసారి స్థానికంగా ఉండే తనకు అవకాశం ఇచ్చి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో సోదాల రాజకీయం

హైదరాబాద్,నవంబర్3 : ఎన్నికల కాక మీదున్న తెలంగాణలో.. కొత్తగా సోదాల రాజకీయం మొదలయింది. ఇంత వరకూ రోడ్లపై వాహనాల తనిఖీలు జరుగుతుండగా.. ఇప్పుడు కొత్తగా ఆదాయ పన్ను శాఖ అధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఇంతకూ ఐటీ రైడ్స్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం ఉందా..? సోదాలపై ఈసీ ఏమంటోంది..? ఇదే అంశం రాష్ట్ర వ్యాప్తంగా సెన్సేషనల్‌గా మారింది. తెలంగాణలో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. ప్రధాన పార్టీలు నువ్వా నేనా అనే స్థాయిలో బరిలో పోటీ పడుతున్నాయి. ఇదే సమయంలో రాష్ట్రంలో జరుగుతున్న ఐటీ దాడులు కలకలం రేపుతున్నాయి. కాంగ్రెస్ నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు పలువురు నేతల ఇళ్లలో సోదాలు జరిగాయి. మహేశ్వరం హస్తం పార్టీ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డితో పాటు బడంగ్?పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నేత లక్ష్మారెడ్డి నివాసాల్లో తనిఖీలు చేశారు ఇన్‌కమ్ టాక్స్ అధికారులు. దాదాపు 3 కోట్ల రూపాయలను సీజ్ చేశారు. కేఎల్ఆర్ ఇంట్లో రూ. కోటి, లక్ష్మారెడ్డి ఇంట్లో రూ. 2 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోసమే డబ్బు సమకూర్చినట్టు గుర్తించిన అధికారులు, ఈ మేరకు పలు కీలక డాక్యుమెంట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. అయితే ఓటమి భయంతోనే తమ పార్టీ నేతలపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నేతలు ఐటీ దాడులు చేయిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయాడానికి కుట్రలు చేస్తున్నారని, వీటిని ధీటుగా ఎదుర్కొంటామని చెబుతున్నారు. అయితే బీజేపీ మాత్రం ఐటీ దాడుల్లో ప్రభుత్వ ప్రమేయం ఉండదని స్పష్టం చేస్తోంది. ఐటీ అధికారులకు ఉన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తారని, అందులో ఎవరి పాత్ర ఉండదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చెబుతున్నారు. ఎన్నికల్లో ప్రలోభాలను అరికట్టడంతో పాటు నిష్పక్షపాతంగా పోలింగ్ జరపాలన్న ఉద్దేశంతో ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోందన్నారు ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్. అందులో ఐటీ దాడులు రెగ్యులర్ ప్రాసెస్ అని వివరించారు. మరోవైపు, ఆదాయ పన్ను శాఖ అధికారుల దాడులను ధీటుగా ఎదుర్కొంటునే ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఇందులో భాగంగానే మిషన్ తెలంగాణ పేరిట పీసీసీ శిక్షణ కార్యక్రమం చేపట్టింది. కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ సీఎం చవాన్‌తో పాటు తెలంగాణ ఇన్‌ఛార్జి మాణిక్ రావు ఠాక్రే పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గాలకు కో-ఆర్డినేటర్లను నియమించిన పీసీసీ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించింది. బూత్ స్థాయి ఏజెంట్లు, డివిజన్ స్థాయి నేతలతో నిత్యం టచ్‌లో ఉండాలని సూచించింది.

# కాళేశ్వరం ప్రాజెక్టును కమీషన్ల కోసమే కట్టారా

## నైతిక బాధ్యత వహిస్తూ సీఎం రాజీనామా చేయాలి

## ప్రాజెక్టు కుంగిన వెంటనే జల్‌శక్తి శాఖకు ఫిర్యాదు చేశా

## నేడు కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటనకు వెళ్తాం

## రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్3 : రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఇవాళ్టి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తెలంగాణలో ఎన్నికల ప్రచారాన్ని ఉద్ధృతం చేసే ప్రణాళికలో భాగంగా హైదరాబాద్?లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కిషన్?రెడ్డి అధికార బీఆర్ఎస్?పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మేడిగడ్డ ప్రాజెక్ట్?లో ఉత్పన్నమైన లోపాలను వివరిస్తూ.. కేంద్ర బృందం ప్రతిపాదనలను వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కమీషన్ల కోసమే కట్టారా అంటూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి.. కేసీఆర్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పార్టీ ప్రచారాలను ఉద్ధృతం చేసేలా హైదరాబాద్?లో నిర్వహించిన పార్టీ సమావేశంలో పాల్గొన్న కిషన్ రెడ్డి.. మేడిగడ్డ ప్రాజెక్టు వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిన వెంటనే కేంద్ర జల్‌శక్తి శాఖకు తానే ఫిర్యాదు చేశానన్నారు. ప్రజల సొమ్ముతో కడుతున్న ప్రాజెక్టు నాణ్యతను పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించిన కిషన్ రెడ్డి.. తాను ఉత్తరం రాసిన వెంటనే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు స్పందించారని తెలిపారు. కేంద్రం నుంచి వెంటనే ఆరుగురు సభ్యుల బృందం వచ్చి మేడిగడ్డను పరిశీలించినట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రచారాన్ని ఉద్ధృతం చేసేందుకు హైదరాబాద్‌లో మీడియా సెంటర్‌ను బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్?ఛార్జ్ ప్రకాశ్ జావడేకర్ ప్రారంభించారు. రాష్ట్రంలోని బీజేపీ అగ్రనేతలంతా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కేసీఆర్ ఫ్యామిలీ డ్రీమ్ ప్రాజెక్టుగా చెప్పుకునే కాళేశ్వరం.. నేడు తెలంగాణకు గుదిబండగా మారిందని కిషన్?రెడ్డి ఎద్దేవా చేశారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రాజెక్టు కట్టామని చెప్పిన ప్రభుత్వం.. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు అడిగిన వివరాలు లేవనటం హాస్యాస్పదమన్నారు. కట్టిన నాలుగేళ్లకే పిల్లర్లు కుంగిపోయాయని.. వాటి స్థానంలో కొత్తవి నిర్మించాల్సి ఉందని నిపుణులు చెబుతున్నట్లు బీజేపీ అధ్యక్షుడు వివరించారు. లేదంటే ప్రాజెక్టు పూర్తిగా ధ్వంసమయ్యే అవకాశం ఉందని చెప్పినట్లు తెలిపారు. అయినప్పటికీ దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పలేని పరిస్థితి ఉందని ఆక్షేపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కొన్ని ప్రాథమిక వివరాలను రాష్ట్ర ప్రభుత్వాన్ని.. డ్యామ్ సేఫ్టీ అధికారులు అడిగారు. కానీ వాటి వివరాలు లేవని చెబుతున్నారు. ఇది ఇంకా నేరంగా భావించాలి. ఎందుకంటే ఇంత భారీ ప్రాజెక్టుకు కనీస ప్రాథమిక వివరాలు లేకపోవడం ఎంతో దయనీయం.

# 24 గంటల కరెంటు ఇస్తున్నఏకైక రాష్ట్రం తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

సహా కాంగ్రెసోళ్లు ధరణిని బంగాళాఖాతంలో వేస్తం అంటున్నరు. ధరణిని కాదు, కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో వేయాలని సీఎం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే తెల్ల రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం ఇస్తం. కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దు. నమ్మి మోసపోవద్దు. సంజయ్ మంచి వైద్యుడు. ఆయన తలుచుకుంటే వృత్తి ద్వారా కోట్లు సంపాదించుకోవచ్చు. కానీ నేను నా గడ్డకు సేవ చేసుకుంటా అనే సంకల్పంతో పోటీకి సిద్ధమైండు. నేను నిరాహార దీక్ష చేసిన సమయంలో డాక్టర్ సంజయ్ నన్ను దగ్గరుండి చూసుకున్నడు. నా ప్రాణాలు కాపాడిండు. డాక్టర్ సంజయ్ నాకు బిడ్డ లాంటి వాడు. రాష్ట్రంగానీ, దేశంగానీ బాగుపడ్డదా..? వెనుపడ్డదా..? అని తెలుసుకునేందు రెండే గీటురాళ్లు. అందులో ఒకటి ఆ రాష్ట్రం లేదా దేశం తలసరి ఆదాయం. 2014లో తెలంగాణ 18వ స్థానంలో ఉండె. ఇప్పుడు అద్భుతమైన పంటలతో ఆర్థికంగా ఎదిగి రూ.3.18 లక్షల తలసరి ఆదాయంతో దేశంలో నెంబర్ వన్‌గా ఉన్నది. కరెంటు సప్లయ్‌లో కూడా తెలంగాణ నెంబర్ వన్‌గా ఉన్నది. కాబట్టి మీ అందరి సహకారంతో తెలంగాణ ఇదేవిధంగా ఇంకా ముందుకు పోవాలి. డాక్టర్ సంజయ్ స్థానిక బిడ్డ. ఆయనను మీరంతా ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని సీఎం కేసీఆర్ కోరారు. బీడీ కార్మికులు కష్టజీవులు.. వారి బాధలను కండ్లారా చూశాను అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమోషనల్ అయ్యారు. ఎవరూ దరఖాస్తు పెట్టకముందే బీడీ కార్మికులకు పెన్షన్‌లు మంజూరు చేశాను. కొత్తగా నమోదైన బీడీ కార్మికులకు తప్పకుండా పెన్షన్ మంజూరు చేస్తాను.. ఇది నా వాగ్దానం, రంది పడాల్సిన అవసరం లేదని కేసీఆర్ పేర్కొన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు ఎన్నో ఏండ్ల నుంచి మీ సేవలో ఉన్నారని కేసీఆర్ గుర్తు చేశారు. పార్టీల యొక్క నడవడిక, వైఖరి గురించి ఆలోచించాలి. గతంలో అవకాశం ఇస్తే ఏం చేశారో



ఆలోచించాలి. ఉద్యమం ప్రారంభించినప్పుడు మీరు చాలా మంది ఉన్నారు. మెట్‌పల్లి, కోరుట్లకు వచ్చాను. మీరంతా కలిసి ఉద్యమాన్ని ముందుకు నడిపారు. బీఆర్ఎస్ పదేండ్ల ప్రభుత్వంలో, 50 ఏండ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏం జరిగిందో మీ సొంత అనుభవంలో ఉంది. అవన్నీ బేరీజు వేసుకోవాలి. ఆలోచించి ఓటేయాలని కేసీఆర్ సూచించారు. చేనేత కార్మికులు సిరిసిల్ల, భూదాన్ పోచంపల్లి, దుబ్బాకలో ఆరేడుగురు చనిపోవడం.. మేం పోయి ఆ శవాలను పట్టుకొని ఏడ్వడం జరిగాయని కేసీఆర్ గుర్తు చేశారు. పోచంపల్లిలో ఏడుగురు నేతన్నలు చనిపోతే నేను పోయి ఆ శవాలను పట్టుకొని అప్పుడున్న సీఎంకు రెండు చేతల దండం పెట్టి బతిమాలిడాను. ఒక యాభై వేలో, లక్ష రూపాయాలో ఇవ్వమని అడిగితే ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు అని కేసీఆర్ గుర్తు చేశారు.
తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని తెలంగాణ కష్టాలు ఏమున్నాయి అని మేధావులతో నాలుగు మాసాలు ఆలోచించినట్లు కేసీఆర్ తెలిపారు. మన కర్తవ్యం ఏందని కష్టపడి ఆలోచించి ఓ దారి పెట్టుకుని ముందుకు పోతున్నాం. మొదటగా పేదల సంక్షేమం గురించి ఆలోచించాం. అంతకు ముందు తమాషా కోసం పెన్షన్లు ఇచ్చేవారు. 70, 40, 200 పెన్షన్ చూశాం. కానీ వేల రూపాయాలకు తీసుకుపోయింది ఒక కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే. నేను కొంతకాలం కేంద్రంలో కార్మిక శాఖ మంత్రిగా పని చేశాను. బీడీ కార్మికులు 19 రాష్ట్రాల్లో ఉన్నారు. బెంగాల్, మహారాష్ట్ర చాలా రాష్ట్రాల్లో ఉంటారు. కానీ పెన్షన్ ఇవ్వరు అని కేసీఆర్ గుర్తు చేశారు. నేను హైస్కూల్ చదువుకున్నప్పుడు దుబ్బాకలో బీడీలు చేసే వారి ఇండ్లో ఉన్నాను అని సీఎం తెలిపారు. అక్కడ నాలోకి రెండు అనుభవాలు వచ్చాయి. వారు చేనేత కార్మికులు కూడా. మగాయన చీరలు నేసేది.. నాకు అన్నం పెట్టే అమ్మ బీడీలు చేసేది. వారు తినే తిండి, అవస్థలు చూశాను. వాళ్ల బాధలు కండ్లారా చూశాను. వాళ్లకు వచ్చే రోగాలు ఏవో కూడా తెలుసు. బీడీ కార్మికులు కష్టజీవులు అని తెలుసు కాబట్టే.. నాకు ఎవరూ దరఖాస్తు పెట్టకముందే.. నా అంతకు నేను ఆలోచించి బీడీ కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నాం. ఓట్ల కోసం, మోసం చేసేందుకు పెన్షన్లు ఇవ్వడం లేదు. ఎన్నికల ప్రణాళికలో చెప్పినవీ పది అయితే చెప్పకుండా చేసింది 100 కార్యక్రమాలు. బీడీ కార్మికుల పెన్షన్ రూ. 2 వేల నుంచి రూ. 5 వేలకు పోతది. గవర్నమెంట్ రాగానే మార్చిలో రూ. 3 వేలు అయితది. ఆ తర్వాత ఏడాదికి రూ. 500 పెరుగుతూ రూ. 5 వేలకు పోతది. బీడీ కార్మికులు ఎక్కడైతో ఉన్నారో.. కొత్త కార్మికులకు కూడా వంద శాతం పెన్షన్ మంజూరు చేస్తాను. ఇది నా వాగ్దానం.. రందీ పడాల్సిన అసవరం లేదు. ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తాను అని కేసీఆర్ స్పష్టం చేశారు.వైద్యుడిగా రూ.కోట్లు సంపాదించుకోవచ్చు. కానీ, ఆయన ప్రజాసేవ చేద్దామనే రాజకీయాల్లోకి వచ్చారు. తాను ఢిల్లీలో ఆమరణ
నిరాహార దీక్ష చేపట్టినప్పుడు పక్కనే ఉండి తన ప్రాణాలు కాపాడారని చెప్పారు. 'యువకుడు, వైద్యుడు అయిన సంజయ్ ను మీరంతా ఆశీర్వదించాలి' అంటూ కేసీఆర్ కోరుట్ల ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు.

# ప్రజా స్వామ్యములో ఓటే వజ్రాయుధం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు నాతోనే ఉన్నారు తెలంగాణ రావడానికి కారణం బీఆర్ఎస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. సిరిసిల్ల, దుబ్బాక, బూదాన్ పోచంపల్లి లో నేతన్నలు, రైతులు మరణిస్తే అప్పుడు ఉన్న కాంగ్రెస్ ముఖ్య మంత్రి వద్దకు వెళ్లి అడిగితె వారు పట్టించు కోలేదని రాష్ట్రం ఏర్పడి మా ప్రభుత్వం వచ్చాక ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీ కారం చుట్టామని నేను కేంద్రంలో కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు బీడీ కార్మికులు అనుభవించిన కష్టాలు తెలుసనీ అందుకే తెలంగాణ ఏర్పడిన తర్వాత బీడీ కార్మికులకు పెన్షన్ విధానం తేవడం జరిగిందని మల్లి మా ప్రభుత్వం ఏర్పడి తర్వాత బీడీ కార్మికుల పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చారు. అలాగే చేనేత కార్మికులకు కూడా బడ్జెట్ ను పెంచి ఆదుకుంటామని అన్నారు. నాటి ప్రభుత్వాలు యేనాడు రైతు లను పట్టించుకొన్న దాఖలాలు లేవని రాష్ట్రం ఏర్పడిన తర్వాత మా ప్రభుత్వం పల్లెలు బాగుండాలి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని వ్యవసాయనికి 24గంటల ఉచిత విద్యుతు అందిస్తున్నామని రాష్ట్రం లో కరెంట్ కోతలు లేకుండా దేశంలోనే 24గంటలు నాన్యమైన విద్యుత్ ఇస్తున్న ఒకే ఒక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. పేద వారి వివాహానికి కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ వృద్దులకు వృద్ధాప్య పెన్షన్లు అందిస్తున్న ప్రభుత్వం అని రైతు బాగుంటే దేశం బాగుంటుంది అనే సంకల్పం తో రైతు బంద్, రైతు భీమా తీసుకువచ్చి రైతుల కన్నీళ్లు తుడిచామని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ తమ ప్రభుత్వం అధికారం లోకి వస్తే ధరణి ఎత్తి వేస్తామని అన్నారు. ధరణి తీసివేస్తే దళారుల రాజ్యం వస్తుందని తద్వారా ప్రజల భూములన్నీ మాటుమాయం అవుతాయని అందుకే ధరణి తెచ్చామ్మని అన్నారు. నేను ఉద్యమ కాలంలో ఆసుపత్రి లో ఉండగా, సంజయ్ నన్ను దగ్గర ఉండి చూసుకొన్నాడని, నా బిడ్డ లాంటి వాడైనా సంజయ్ యువకుడు, ప్రజలకు మంచి చేయాలని తపన ఉన్న మంచి నాయకుడు విద్యా వేత్త అలాంటి వారిని గెలిపిస్తే ప్రజలకు మేలు కలుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే విద్యా సాగర్ రావు మాట్లాడుతూ 25సంవత్సరాలనుండి ప్రజా సేవలో ఉన్నానని నన్ను ఆదరించిన ప్రజలందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, అదేవిదంగా నా వారసత్వాన్ని తీసుకొన్న మీ బిడ్డ సంజయ్ ని కూడా ఆశీర్వదించి గెలిపించాలని కెసిఆర్ కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ మాట్లాడుతూ ఇక్కడ పుట్టిన మీ బిడ్డను కాకుండ ఎక్కడి నుండి వచ్చిన వారికి అవకాశం ఇస్తారా ఒక్క సారి ఆలోచించి నాకు అవకాశం ఇవ్వండి కెసిఆర్ నా పై పెట్టిన భాద్యత ను నెరవేరుస్తానని కోరుట్ల నియోజక వర్గం అభివృద్ధి కి పాటుపాడుతానని అన్నారు.ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ రమణ, జడ్పీ చైర్మన్ దావ వసంత మాజీ స్పీకర్ మధుసూదనా చారి, ఎంపీ దామోదర్ రావు, లోక బాపు రెడ్డి, తోట నారాయణ, చీటీ వెంకట్రావ్,బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అన్నం అనిల్, పవన్, దారిశెట్టి రాజేష్, భాస్కర్ రెడ్డి మరియు వివిధ గ్రామాల సర్పంచులు, వార్డ్ కౌన్సిలర్లు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

# దళితబంధు పేరుతో ఓట్లకు గాలం

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. యువకుడి సూసైడ్ నోట్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. అణగారిన వర్గాల సంక్షేమం గతంలో కాంగ్రెస్ పార్టీ శ్రమించిందని. కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను బీఆర్ఎస్ అమలు చేయకపోవడంతో యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ మోసపూరిత వాగ్దానాలతో దళిత గిరిజన కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకుంటున్నాయని ఆరోపించారు. తెలంగాణ వస్తే కష్టాలు తీరతాయన్న యువత కలలు నేరవేరలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని, అప్పుడు బలహీన వర్గాల కలలు నిజం చేస్తామన్నారు. దొరల తెలంగాణ పోయి ప్రజల తెలంగాణ తీసుకొస్తామని రాహుల్ గాంధీ చెప్పారని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. దళిత, గిరిజన కుటుంబాల చెందిన వారెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మోస పోయిన వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నెల రోజుల్లో కొట్లాడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చుకుందామని అన్నారు. ఇకపోతే కాంగ్రెస్‌కు మద్దతివ్వాలంటూ వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలిపారు. వైఎస్ఆర్ బిడ్డగా కాంగ్రెస్‌తో షర్మిల కలిసి రావడం శుభపరిణామమని చెప్పారు. మరోవైపు హుజూరాబాద్ లో ఓట్ల కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చారని భట్టి ఆరోపించారు. దళిత బంధు పథకానికి బడ్జెట్‌లో రూ.17వేల కోట్లు కేటాయించిన కేసీఆర్ ప్రభుత్వం.. ఈ ఏడాది ఎంతమందికి ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. నమ్మి ఓట్లేసిన ప్రజలను సీఎం కేసీఆర్ నిలువునా ముంచారని బట్టి విక్రమార్క మండిపడ్డారు. ఎస్సీలకు మూడెకరాల భూమి ఇస్తామన్న కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రజలకు కేసీఆర్ ఓ కలల ప్రపంచాన్ని చూపించారని విమర్శించారు.

ఈ ఎన్నికల్లో దొరల తెలంగాణ, ప్రజా తెలంగాణ మధ్య యుద్ధం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ యుద్ధంలో ప్రజలే గెలవాల్సిన అవసరం ఉందని రాహుల్ గాంధీ కోరుకుంటున్నారని భట్టి విక్రమార్క చెప్పారు. దళితులకు ఇచ్చిన హామీలు కేసీఆర్ నిలుపుకోలేదని ఆయన విమర్శించారు. పాలకులు ప్రజల బాగోగుల గురించి ఆలోచించాలని, బలహీన వర్గ ప్రజలు ఏమైనా పర్వాలేదని బీఆర్ఎస్ ప్రభుత్వం అనుకుంటుందని బట్టి విమర్శించారు. దళిత, గిరిజన, మైనార్టీ బలహీన వర్గాలు 92 శాతం రాష్ట్రంలో ఉన్నారని, సీఎం కావడానికి మొదటగా దళిత ముఖ్యమంత్రి అని కేసీఆర్ కలల ప్రపంచం సృష్టించారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీకి అవసరం లేదన్నారు. ఎంఐఎం అభ్యర్థుల గురించి ఒవైసీ పట్టించుకుంటే సరిపోతుందన్నారు.

# వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ట్విస్ట్

చేయడం లేదని, కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌టీపీ శ్రేణులు, వైఎస్సార్ అభిమానులందరూ కాంగ్రెస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. ఓటు బ్యాంక్ చీలకూడదనే కారణంతో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. మీడియా ముందు ప్రకటించడమే కాకుండా.. కాంగ్రెస్‌కు మద్దతివ్వడంపై రాహుల్ గాంధీకి షర్మిల లేఖ కూడా రాశారు. ఈ క్రమంలో షర్మిల చేసిన ప్రకటనపై తెలంగాణ కాంగ్రెస్ స్పందించింది. థ్యాంక్యూ షర్మిల గారు అంటూ తెలంగాణ కాంగ్రెస్ అధికారిక ట్విట్టర్ హ్యాండిల్‌లో పోస్ట్ పెట్టింది. ఈ సందర్భంగా షర్మిలకు ధన్యవాదాలు తెలిపింది. కాంగ్రెస్‌కు మద్దతివ్వడంతో రాహుల్ గాంధీకి రాసిన లేఖను వైఎస్ షర్మిల తన అధికారిక ట్విట్టర్ అకౌంట్‌లో పోస్ట్ చేశారు. దీనిని షేర్ చేసి టీ కాంగ్రెస్.. థ్యాంక్యూ షర్మిల అంటూ రిప్లై ఇచ్చింది. దీంతో ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. అయితే కేసీఆర్ నీచ పాలనను అంతమొందించేందుకే కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్లు షర్మిల మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయని, కేసీఆర్‌ను అధికారం నుంచి దించడానికి ఎలాంటి కఠిన నిర్ణయానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. తెలంగాణ భవిష్యత్ కోసం ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా త్యాగం చేస్తున్నట్లు షర్మిల తెలిపారు. కేసీఆర్ ఓడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, కాంగ్రెస్ గెలుపు అవకాశాలను అడ్డుకోకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌టీపీ శ్రేణులందరూ అర్థం చేసుకోవాలని సూచించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని వైఎస్సార్ అనుకున్నారని షర్మిల గుర్తు చేశారు.

ఢిల్లీలో తాను సోనియాగాంధీ, రాహుల్ గాంధీ లను కలిసినప్పుడు తనను కుటుంబసభ్యురాలిగా చూశారని పేర్కొన్నారు. కాగా కాంగ్రెస్‌లో విలీనం కుదరకపోవడంతో షర్మిల ఒంటరిగా బరిలోకి దిగనున్నట్లు ప్రకటించారు. 119 స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపుతున్నామని, ఆశావాహులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విలీనానికి రేవంత్ రెడ్డి అడ్డుకట్ట వేశారని, అందుకే షర్మిల విలీనంపై వెనక్కి తగ్గారనే ప్రచారం నడిచింది. కానీ ఏమైందో ఏమో కానీ చివరికి మళ్లీ కాంగ్రెస్‌కే షర్మిల జై కొట్టడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# నిరంకుశ పాలనను అంతమొందించాలి : తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం,నవంబర్3 : ఈ నెల 30న జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ తరపున నామినేషన్ దాఖలు చేశానని, సోనియా, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే ఆశీస్సులతో ఖమ్మం అభ్యర్థిగా నామినేషన్ వేశానని తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఖమ్మం లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆధునిక ఖమ్మం రూపశిల్పిగా ఖమ్మం ప్రజానీకం ఆకాంక్షల కోసం పనిచేస్తానని అన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలని సోనియా గాంధీ రుణం తీర్చుకుకుందామని పిలుపిచ్చారు. ఆరు గ్యారంటీ పథకాలు అమలు తెలంగాణకు మంచి భవిష్యత్ అని, నిరంకుశ అవినీతి, అప్రజా స్వామికపాలనకు వ్యతిరేకంగా ఖమ్మం తో పాటు యావత్ తెలంగాణ ప్రజానీకం చారిత్రక తీర్పు ఇవ్వాలని తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# అన్ని వర్గాల అభ్యున్నతే కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంలో ఆయన గురువారం ధర్మపురి ఆశీర్వాద సభలో పాల్గొని నియోజకవర్గంలో ఒకే సారి ఒకే విడతలో 100 శాతం దళిత బందు అమలుపై ప్రకటన చాలా గొప్ప విషయమన్నారు.హుజూరాబాద్ లో 18 వేల కుటుంబాలకు 2 వేల కోట్లు ఖర్చు పెట్టి దళిత బందు అందించినట్లుగా ధర్మపురి నియోజక వర్గంలోని 20 వేల కుటుంబాలకు ఒకే సారి 2 వేల కోట్లతో దళిత బందు అమలు చేస్తామని ప్రకటన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కేసిఆర్ నోట వెలువడిన మాట తిరుగు లేనిదని, దీంతో దళితుల జీవితాలు బాగుపడు తాయని దీనిలో భాగస్వామి కావడం కన్న గొప్ప సార్థకత తన జీవితంలో ఏం ఉంటుందని, ముఖ్యమంత్రి కేసీఅర్ కి ఈసందర్భంగా పాధాభి వందనం చేస్తున్నానని మంత్రి కృతజ్ఞత చాటారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ఎంపీపీ చిట్టిబాబు జెడ్పీటీసీ అరుణ మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, వైస్ చైర్మన్ రామయ్య మార్కెట్ చైర్మన్ రాజేశ్ కుమార్ వైస్ చైర్మన్ సునీల్ కుమార్, శ్యామ్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మందు, డబ్బు లేకుండా ఎన్నికల్లోకి వెళదాం

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ వాదనల్లో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడలేదన్నారు. మైనారిటీలను అన్ని రకాలుగా సంక్షేమంలో భాగస్వాములను చేస్తామని చెప్పుకొచ్చారు. జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. పేదలకు విద్యను చేరువ చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ ఏర్పాటు చేసిన స్కూళ్లలో 6,540 సింగిల్ టీచర్ స్కూళ్లను కేసీఆర్ హయాంలో మూసేశారన్నారు. రైతులకు ఎకరానికి ఏటా 10 వేలు ఇస్తామని 2014లోనే కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిందని.. దాన్నే కాపీ కొట్టి కేసీఆర్ రైతు బంధు పేరుతో ఇస్తున్నారని అన్నారు. తన లోపాలను కప్పిపుచ్చుకునేందుకే పక్క రాష్ట్రాల అంశాన్ని తెరపైకి తెస్తున్నారన్నారు. కాంగ్రెస్ దశాబ్ద పాలన - బీఆర్ఎస్ దశాబ్ద పాలనపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. "మా పార్టీ నుంచి నేను, సీఎల్పీ భట్టి వస్తాం... మిగతా పార్టీల నుంచి ఇద్దరు చొప్పున రండి. చర్చ పెడితే పాలకు పాలు, నీళ్లకు నీళ్లు బయట పడతాయి. ఓటుకు వెల కట్టే సంస్కృతి తెచ్చిందే కేసీఆర్. హైదరాబాద్‌లో ఐటీకి పునాది వేసింది కాంగ్రెస్. హైదరాబాద్‌ను పెట్టుబడి నగరంగా తీర్చిదిద్దుతాం. గంగా నదిలా మూసీని ప్రక్షాళన చేస్తాం. మూసీ రివర్ ఫ్రంట్‌ను అద్భుతంగా అభివృద్ధి చేసే ప్రణాళిక మా దగ్గర ఉంది. అర్బన్, రూరల్ హైదరాబాద్‌కు కనెక్టివిటీ ఇవ్వనున్నాం. రాచకొండ గుట్టలను తెలంగాణ ఊటీలా అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్‌ను ప్రపంచానికే తలమానికంగా మారుస్తాం" అని టీపీసీసీ చీఫ్ వెల్లడించారు. కమ్యూనిస్టులతో పొత్తుల అంశం ఇంకా ముగియలేదని రేవంత్ అన్నారు. పొత్తు అంశంపై తమ సమన్వయ కమిటీ చర్చలు జరుపుతోందన్నారు. ధరణి పోర్టల్ పేరుతో ప్రభుత్వమే పెద్ద దళారీగా మారిందని ఆరోపించారు. ధరణిలో అత్యంత పెద్ద దళారులు కేసీఆర్ కుటుంబసభ్యులే అని.. తాము ధరణిని రద్దు చేస్తామంటే కేసీఆర్‌కు ఎందుకంత దుఃఖం అంటూ రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు.

# ముఖాముఖి పోటీ దిశగా తెలంగాణ ఎన్నికలు !

కర్నాటకలో ఓటమి బిజెపిని దక్షిణాదిలో అడుగుపడనీయకుండా చేస్తోంది. బలపడాలన్న ఆకాంక్ష ఉన్నా తప్పటడుగులు బిజెపిని అడుసులోకి తొక్కేలా చేస్తున్నాయి. తెలంగాణ రాజకీయాలతో ఇప్పుడు ఎన్నికలు ముఖాముఖిగా మారాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల మధ్య పోటీగా మారాయి. బిజెపి ఇక పోటీలో లేదనుకునేలా పరిస్థితులు క్రమంగా మారుతున్నాయి. కేరళలో ఎలాగూ ఛాన్స్ లేదు. తమిళనాట కూడా బిజెపికి ఓట్లు పడవు. పదేదల్లా కర్నాకట తరవాత ఒక్క తెలంగాణలోనే..అదికూడా చేజేతులా చేజార్చుకున్న ఘనత ఆ పార్టీదే. తనవేళ్లతో తన కళ్లనే పొడుచుకున్న చందాన ఇప్పుడు తెలంగాణలో కమలం కకావికలం అవుతోంది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీకి అన్నీ ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించిన తర్వాత మొదలైన కమలనాథుల రాజీనామాలు.. నేటి వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. బీజేపీ అభ్యర్థుల జాబితా ప్రకటన వచ్చేసరికి టికెట్లు ఆశించిన, అసంతృ ప్తులు ఒక్కొక్కరుగా కమలం పార్టీకి గుడ్ బై చెప్పేసి.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో చేరిపోతున్నారు. కొందరేమో ఇక కమలంతో లాభం లేదనుకుని టాటా చెప్పేస్తున్నారు. మోడీపేరు చెప్పుకుని లబ్దిపొందా లన్న బిజెపికి తెలంగాణలో పప్పులు ఉడకవని తెలిసినా మేకపోతు గాంభీర్యం వదలడం లేదు. ఇప్పటి వరకూ పదుల సంఖ్యలో ముఖ్య నేతలు, సీనియర్లు కాషాయ పార్టీకి రాజీనామా చేశారు. మరోవైపు సీనియర్ నేతలు సైతం అదేబాట పడుతున్నారు. టికెట్లు ఆశించిన యువనేతలు అయితే తీవ్ర అసంతృప్తితో ఇక ఎప్పటికీ న్యాయం జరగదని భావించి కమలానికి గుడ్‌బై చెప్పేస్తున్నారు. అసలు పార్టలో పెద్దగా టిక్కెట్లకు డిమాండే లేదు. కానీ ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసినప్పటికీ టికెట్ ఇవ్వక పోగా.. కనీసం ఎందుకివ్వ లేదో.. ఈ పరిస్థితి ఎందుకొచ్చిందఅనే విషయాన్ని కనీసం పిలిపించి మాట్లాడే పరిస్థితి కూడా బీజేపీ అధిష్టానం చేయడం లేదని సీనియర్ నేతలు రగిలిపోతున్నారు. ఈక్రమంలో కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీకి దక్షిణాదిలో బలపడాలన్న ఆకాంక్ష నెరవేరడం లేదు. ఉన్న కర్ణాటకలో కూడా అధికారం తుడిచిపెట్టుకుపోయింది. నాలుగు దక్షిణాది రాష్టాల్లో బీజేపీ బలం అంతంత మాత్రమే. దీంతో ఏపీ,తెలంగాణ రాష్ట్రాల్లో రాజకీయంగా బలం కూడా అంతంతమాత్రంగానే ఉంది. దీనికితోడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అణగదొక్కడానికి బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ లాలూచీ రాజకీయాలు నడుపుతోందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఏపీలో కూడా అధికార, ప్రతిపక్షాలను దెబ్బతీసి పాతుకు పోవాలని చూస్తోంది. వైసీపీ, టీడీపీలను కాదని బీజేపీకి అధికారం అప్పగించడం కాదుకదా..ఒక్కసీటయినా గెలిపిస్తారా అన్నది అనుమానమే. అయితే ఎపి విభజన తీరుపై ఎపికి అనుకూలంగా ప్రధాని మాట్లాడుతున్న తీరు ఏపీలో సానుభూతిని పొందేందుకు చేస్తున్న ప్రయత్నంగా కనిపిస్తోంది. ఎపిలో అధికారంలోకి రావాలనే దీర్ఘకాలపు వ్యూహాన్ని అమలు చేస్తున్నా..తెలంగాణతో పోలిస్తే అక్కడ దానికి ఏ మాత్రం పునాది లేకుండా పోయింది. వైసిపికి అంటకాగుతోందన్న అనుమానాలు ఉన్నాయి. దీంతో బిజెపిని అక్కడా నమ్మే పరిస్థితి లేదు. దీంతో మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలు, అర్బన్ ఓటర్లు, విద్యావంతులతో పాటు, సామాన్య హిందూ ఓటర్లలో బలంగా నిలిచేందుకు ప్రణాళిక రచిస్తోంది. దక్షిణాదిలో ఇప్పటికి బీజేపీ చాలా చిన్నపార్టీగానే గుర్తించాలి. అద్వానీ రథయాత్ర కారణంగా బీజేపీ పూర్తిస్థాయి హిందుత్వ పార్టీగా ఎదిగినా తెలంగాణ, ఎపిల్లో మాత్రం సత్తా చాటలేకపోతోంది. సాంప్రదాయక కాంగ్రెస్ ఓటు బ్యాంకుతో నిర్మితమైన వైసీసీని దెబ్బతీసి పరోక్షంగా టీడీపీని బలహీనపరచి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో కనుమరుగు చేయగలిగితే దీర్ఘకాలంలో లాభపడొచ్చని బీజేపీ భావిస్తోంది. ఎన్టీఆర్ తనయ పురంధేశ్వరిని రాష్ట్ర బిజెపికి అధ్యక్షురాలు ని చేయడంలోనూ మాస్టర్ ప్లాన్ ఉందని అనిపిస్తోంది. టిడిపి దెబ్బతింటే వారంతా ఇటు బిజెపిలో చేరుతారన్న ఆలోచన కావచ్చు. అందుకే పురందేశ్వరి ద్వారా బిజెపి రాజకీయాలు నడిపిస్తోంది. అనూహ్యంగా ఇప్పుడు టిడిపి నేత చంద్రబాబు కేసుల్లో అరెస్ట్ కావడంతో దానిని క్యాష్ చేసుకునే యోచనలో ఉంది. టీడీపీ బలహీనపడితే తమకు లాభిస్తుందన్న యోచనలో ఆ పార్టీ ఉందన్న ఆరోపణలూ ఉననాయి. ఇకపోతే తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమంటూ జాతీయ, రాష్ట్ర నాయకులు కుండబద్దలు కొడుతున్నా, కొద్ది రోజులుగా పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మాత్రం కేడర్‌ను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. సీనియర్ నేతల మధ్య ఉన్న విభేదాలు బహిర్గతం అవుతుండడంతో.. ఇది ఎక్కడకు దారితీస్తుందోనని వారిలో బెంగ పట్టుకుంది. పార్టీలో ఉత్సాహంగా వచ్చి చేరిన వారంతా ఒక్కొక్కరే బయటకు జారుకుంటున్నారు. బిఆర్ఎస్‌కు బిజెపి ప్రత్యామ్నాయం కాదన్న విషయాన్ని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఒకరా ఇద్దరా డజనుకుపైగానే పార్టీని వీడారు. బండి సంజయ్ అధ్యక్షుడ య్యాక..పార్టీని గ్రామస్థాయిలోకి తీసుకుని వెళ్లడంతో పాటు..వివిధ పార్టీల్లో ఉన్నవారినంతా బండి లాక్కుని వచ్చారు. బండిని తప్పించగానే వీరుకూడా మెల్లగా జారుకున్నారు. ఇతర పార్టీల నాయకులను ఆకర్షించడం పక్కనబెడితే ఉన్నవారిని బీజేపీ కాపాడుకోలేక పోతోంది. ఎన్నికల వేళ ఆ పార్టీకి షాక్‌లమీద షాకులు తగులుతున్నాయి. ఇప్పటి వరకూ 88 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను బీజేపీ హైకమాండ్ ప్రకటించింది. ఈ రెండు జాబితాల్లోనూ పేర్లు లేక కొందరు రాజీనామా చేశారు. సీనియర్లు ఇమడలేక తప్పుకుంటున్నారు. చిల్లుపడ్డ కుండఖాళీ అవుతున్నా..బిజెపి అచేతనంగా ఉండిపోతోంది. ఎన్నికల్లో నాలుగైదు సీట్లు గెలిచేందు కే బీసీ ముఖ్యమంత్రి నినాదంతో బలహీన వర్గాలను పార్టీ నాయకత్వం ఆకట్టుకునే ప్రయత్నాలు కూడా పెద్దగా ఆకట్టుకునేలా కనిపించడం లేదు.

# భారత సాయుధ తిరుగుబాటు పితామహుడు ఫడ్కే

## నవంబర్ 4...వాసుదేవ బల్వంత ఫడ్కే జయంతి



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

వాసుదేవ్ బల్వంత్ ఫడ్కే... దేశంలో చాలా మందికి తెలియని, విని ఉండని పేరు. ఆ త్యాగ ధనుని గురించి చరిత్ర పుస్తకాలలో కూడా ఎక్కడా కనిపించదు. భారత దేశంలో సాయుధ తిరుగుబాటుకు బీజం వేసిన వ్యక్తి ఆయనే అని, తొలి దేశద్రోహం కేసు నమోదు కాబడింది ఆ ఉద్యమ కారుని మీదే అన్న విషయం తెలిస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఆంగ్లేయుల దురాగతాలను ఎదిరించి, శ్వేత జాతీయులపై తుపాకీ ఎక్కుబెట్టిన వీరుడు. బల ప్రయోగం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుండి తరిమి వేయాలని తీర్మానించి, అమలులో ప్రాణాలు అర్పించిన వీర యోధు డు. శక్తివంత మైన బ్రిటిష్ సామ్రా జ్యాన్ని ఒంటిచేత్తో ఎదిరించి, సాయుధ తిరుగు బాటును రేకెత్తిం చి, భారత్‌లో బ్రిటిష్ అధికారాన్ని నాశనం చేసి హిందూ రాజ్యాన్ని పునః స్థాపిస్తా నని ప్రతిజ్ఞ చేసిన మేరు నగ ధీరుడు. 1879 అక్టోబర్ 22న ఆంగ్ల ప్రభుత్వం మొదటి రాజద్రోహ నేరం మోపబడింది ఈ వీరుడి పైనే కావడం గమనార్హం.



వాసుదేవ బల్వంత ఫడ్కే (4 నవం బర్ 1845 – 17 ఫిబ్రవరి 1883) బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన భారతీయ స్వాతంత్ర్య సమర యోధుడు. ఫడ్కే 1845 నవంబర్ 4న ప్రస్తుతం మహారాష్ట్ర లోని రాయ్‌గఢ్ జిల్లాలో ఉన్న పన్వెల్ తాలూకాలోని షిర్థోన్ గ్రామంలో మరాఠీ చిత్పవన్ బ్రాహ్మణ రైతుకుటుంబంలో కుటుంబంలో జన్మించిన వాసుదేవ్, ప్రాథమిక విద్య తన గ్రామమైన షిర్థోన్ లోనే పూర్తి చేశాడు. హైస్కూల్ విద్యకు పూనాకు వెళ్ళగా ఆంగ్లేయులకు వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడు తున్నాడని 9 వ తరగతి లో బడి నుండి బయటకు పంపారు. పుణే నగరం చేరుకుని మిలటరీ అక్కౌంట్స్ డిపార్టుమెంటులో గుమాస్తాగా 15 సంవత్సరాల పాటు పని చేశాడు. సొంత గడ్డపై వ్యవసాయం చేస్తూ, రైతులపై అధిక పన్నులు విధిస్తున్న ఆంగ్లేయు లకు ఎదురు తిరిగాడు. వలస పాలన నుండి భారత స్వాతంత్ర్యం పొందే లక్ష్యంతో కోలి, బిల్లు, దంగర్ ఆదిగా సుమారు 300 మంది ఆదివాసీ యువకుల సహాయంతో 'రామోషి' అనే విప్లవ తిరుగుబాటు బృందాన్ని రూపొందించి, వారికి యుద్ధ విద్యలపై శిక్షణ నిర్వహిం చాడు.

వాసుదేవ్ మొదట ప్రభుత్వ ఖజా నాలపై దాడి చేయడం మొదలు పెట్టాడు. అలా కొల్లగొట్టిన డబ్బును రైతులకు, ఆదివాసీలకు పంచే వాడు. ఆయుధాలు సమకూర్చు కొనేవాడు. బ్రిటీష్ సైనికులపై హఠాత్తుగా జరిపిన గెరిల్లా దాడుల వల్ల ఏకంగా పుణె నగరం పైనే ఫడ్కే పట్టు సాధించి, పూనాలో బలవంతు డైన తిరుగుబాటు నాయకుడైనాడు. దానితో ఆంగ్లే యులు పెద్దసైన్యం పంపారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకకాలంలో అనేక దాడులను నిర్వహించడానికి వాసుదేవ బల్వంత ఫడ్కే ప్రణాళికలు రచించినా పరిమిత విజయాన్నే అందించాయి. ఒకసారి ఘనూరు గ్రామంలో సైన్యంతో నేరుగా తలప డ్డాడు. వాసుదేవ్ ను పట్టుకుంటే బ్రిటిష్ ప్రభుత్వం బహుమానం ప్రకటిస్తే... బొంబాయి గవర్నర్‌ను పట్టుకున్నందుకు ఫడ్కే ఎదురు బహుమానం ప్రకటించాడు. ప్రతి యూరోపియన్‌ని చంపినందుకు బహుమతిని ప్రకటించాడు. కొన్ని రోజులు పూనాను వదిలి హైదరాబాద్ కు వచ్చాడు. అప్పుడు హైదరాబాద్ పై రోహిల్లాల తిరుగు బాటు జరుగుతున్నది. వాసుదేవ్ వారితో జత కట్టి నిజాంపై తిరుగుబాటు చేసాడు. రోహిల్లా లతో పాటు అరబ్బులు కూడా ఆయనతో చేతులు కలపారు. కాని ఆంగ్లేయుల గూఢ చారులు వాసుదేవ్ ఆచూకీ తెలుసు కున్నారు. బ్రిటిష్ మేజర్ హెన్రీ విలియం డేనియల్, హైదరాబాద్ నిజాం పోలీసు కమిషనర్ అబ్దుల్ హక్ తదతరులు అవిశ్రాంతంగా ఆయన అచూకి కోసం వెతికారు. 20 జూలై 1879న పండార్‌పూర్ వెళ్తున్న ప్పుడు కలడ్గి జిల్లాలో జరిగిన తీవ్రమైన పోరాటంలో వాసుదేవ్ ను ఒక దేవాలయంలో బంధించారు.

ఫడ్కేని విచారణ నిమిత్తం పూణేకు తీసుకెళ్లారు. సర్వజనిక్ కాకా అని పిలువబడే గణేష్ వాసుదేవ్ జోషి ఆయన కేసును వాదించాడు. ఫడ్కేకి జీవిత ఖైదు విధించారు. ఆయన భారత్‌లో ఉంటే ప్రమాద కరమని గ్రహించి, జీవితాంతం ఏడెన్‌లోని జైలుకు తరలించారు. అతనికి సంకెళ్లు వేసి ఏకాంత నిర్బంధంలో ఉంచారు. అక్కడ 13 ఫిబ్రవరి 1883న జైలు నుండి అతను తప్పించుకున్నా మళ్ళీ వెంటనే తిరిగి స్వాధీనం చేసు కున్నారు బ్రిటీష్ పోలీసులు. అప్పటి నుంచి నిరహార దీక్ష చేస్తూ 17 ఫిబ్రవరి 1883న వాసుదేవ బల్వంత ఫడ్కే తుది శ్వాస విడిచాడు.

ఫడ్కే భారత సాయుధ తిరుగు బాటు పితామహుడిగా పేరు పొందాడు. స్వతంత్ర ఉద్యమంలో సహ సభ్యులకు స్ఫూర్తిని అందించాడు. ఈ సమయంలో ఆయన కార్య కలాపాలను బంకిం చంద్ర చటో పాధ్యాయ్ రచించిన దేశభక్తి నవల ఆనంద్ మఠ్ లో పొందు పరిచారు. కానీ అప్పటి బ్రిటీష్ వలస ప్రభుత్వం దీన్ని ఆమోదించ లేదు. అందుకని ఈ అంశాలు తొలగించి పుస్తకాన్ని కుదించి ముద్రించా ల్సి వచ్చింది. 1984 లో, భారతీయ పోస్టల్ సర్వీస్ ఫడ్కే గౌరవార్థం 50 పైసల స్టాంపును విడుదల చేసింది. ఆయన గౌరవార్థం దక్షిణ ముంబై లోని మెట్రో సినిమా సమీపంలో ఒక చౌక్ పేరు పెట్టారు.

# ఆదాయం పెరిగేకొద్దీ సంక్షేమాలు అమలు

- వ్యవసాయం రంగం గతిని మార్చాం
- దళితబంధుతోనే ఎస్సీల్లో మార్పు
- అంకాపూర్ అంటే నాకు ప్రాణం
- అభివృద్ధికి పాటుపడుతున్న జీవన్ రెడ్డి
- ఆర్మూర్ సభలో సిఎం కెసిఆర్ వెల్లడి



ఆర్మూర్,నవంబర్3 : ఆదాయం పెరిగే కొత్తీ సం క్షేమ కార్యక్రమాలు చెంచుతున్నామని ఆర్మూరులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కెసిఆర్ అన్నారు. 10 హామీలిచ్చి, 100 హామీలు నెరవేర్చామని అన్నారు. దశాబ్దాలుగా వెనుకబడి ఉన్న ఎస్సీలు బాగు పడాలనే ఉద్దేశంతోనే దళిత బంధు పథకం తెచ్చామని, ప్రతీ దళిత కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చి ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆర్మూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు. జీవన్ రెడ్డి ఏదైనా కావాలంటే పట్టుదలతో సాధిస్తడు. అందుకే నమ్ముకున్న ప్రజల కోసం పనులు చేయిస్తడు. అందుకే మీ అభిమానం ఇవాళ కనబడుతుంది అని కేసీఆర్ పేర్కొన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఇది ఆర్మూరు జనమా.. ప్రభంజనమా.. అని కేసీఆర్ పేర్కొన్నారు. ఆర్మూర్‌లో ఒక విషయం అయితే తేలిపోయింది. ఈ సభ సముద్రాన్ని చూసిన తర్వాత జీనవ్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిచిపోతారని స్పష్టంగా తేలిపోయింది. జీవన్ రెడ్డి ప్రత్యేకత ఏంటంటే.. తెలంగాణ ఉద్యమంలో ఉండి.. ఎర్ర జొన్న రైతులకు కోసం ఆరమణ దీక్ష చేశారు. ఫైరింగ్ జరిగింది. ఆనాడు కాంగ్రెస్ పార్టీ పోలీసు కాల్పులు జరిపింది. నేను ఎక్కడ్నో కరీంనగర్ పర్యటనలో ఉన్నాను. ఇక్కడ కాల్పులు జరిగాయిని తెలిస్తే హుటాహుటిన ఆర్మూర్‌కు వచ్చాను. అప్పట్నుంచి నాకు సన్నిహితుడై కుటుంబంలో ఓ సభ్యుడిగలా ఉండి, పార్టీని ముందుకు తీసుకుపోతున్నారు జీవన్ రెడ్డి. ఏదైనా కావాలంటే.. వెంబడి పడి సాధిస్తడు జీవన్ రెడ్డి. మండలాలు కావాలంటే అవసరమా అని ప్రశ్నించాను. జీవన్ రెడ్డి మూడు రోజులు అలిగి కూర్చుండు. అలా పట్టుదలతో, పంథాతో నమ్ముకున్న ప్రజల కోసం పనులు చేయిస్తడు. అందుకే మీ అభిమానం ఇవాళ కనబడుతుంది. మీ కోసమే పని చేసే వ్యక్తి.. భారీ మెజార్టీతో గెలిపించాలి. కొందరు ఇప్పుడొచ్చి ఆపదమొక్కులు మొక్కుతారు. అవన్నీ నమ్మకండి. ప్రజల కోసం పని చేసే వ్యక్తి.. తన నియోజకవర్గం కోసం పాటు పడే వ్యక్తి జీవన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి అని కోరుతూ కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు. నాకు అంకాపూర్ అంటే ప్రాణంతో సమానం.. బహుషా ఈ ప్రపంచంలో అంకాపూర్ గురించి నేను చేసినంత ప్రచారం ఎవరూ చేయలేదు అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఎన్నికలు వస్తాయి పోతాయి.. పార్టీకి ఒకరు నిలబడుతారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ బరిలో ఉందని కేసీఆర్ పేర్కొన్నారు. మీ అందర్నీ ప్రార్థించేది ఒక్కటే. ఇక్కడ రైతాంగం అధికంగా ఉంటది. పంటలు బ్రహ్మాండంగా పండిస్తారు. నాకు అంకాపూర్ అంటే ప్రాణంతో సమానం. బహుషా అంకాపూర్ గురించి నేను చేసినంత ప్రచారం ఈ ప్రపంచంలో ఎవరూ చేయలేదు. అంతమంచి అభ్యుదయమైన రైతులు. అంకాపూర్ రైతుల చైతన్యంతో, వారిని స్ఫూర్తిగా తీసుకొని వందలాది గ్రామాలు ఆర్థికంగా ఎదుగుతున్నాయి అని కేసీఆర్ తెలిపారు.

# సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




'ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...

-ఎడిటర్

# మనసున్న మాస్టారు..!



పలాస అనే గ్రామంలో పల్లవి అనే విద్యార్థిని ఉండేది. వాళ్ళ అమ్మానాన్న వ్యవసాయం చేసేవారు. పల్లవి తెలివైన విద్యార్థిని. చురుకైన అమ్మాయి. కొన్ని రోజుల తర్వాత తన తండ్రి ఆరోగ్యం చెడిపోవడంతో మరణించాడు. భర్త మరణం తట్టుకోలేని తల్లి లక్ష్మి ఆరోగ్యం చెడిపోయింది. ఇల్లు గడవడం కష్టంగా మారింది. చదువుకోవాలని ఆశగా ఉన్నా.. పల్లవి పాఠశాలకు వెళ్లే పరిస్థితి లేదు.

పక్క ఇంటిలో ఉన్న పిన్ని దగ్గరికి వెళ్లి "పిన్ని.. పిన్ని.. నీతో పాటు నాకు ఏదైనా పని ఉంటే చూడు. నేను వస్తాను" అని అడిగింది.

"సరే తల్లి. పని దొరికినప్పుడు చెబుతాను. అని అన్నది. ప్రతిరోజు పక్కింటి పిన్ని తో కలిసి పనులకు వెళ్లి వచ్చిన డబ్బులతో తల్లిని చూసుకునేది. తల్లి కొన్ని రోజుల తర్వాత మతిస్థిమితం కోల్పోయింది. పల్లవి తల్లి బాగోగులు చూసుకుంటూ పనికి, వెళ్లి తల్లిని చూసుకోసాగింది. ఒకరోజు పనికి వెళ్లేటప్పుడు పల్లవి వాళ్ళ మాస్టారు ఎదురైతారు. పల్లవి తలవంచుకొని వెళ్ళిపోతుంటే "అమ్మా.. పల్లవి. ఆగు ఎందుకు పాఠశాలకు రావట్లేదు" అని మాస్టారు అడుగుతారు. పల్లవి ఏడుస్తూ జరిగిన సంగతి అంతా చెబుతుంది. "అయ్యో! ఆ భగవంతుడు మంచి వాళ్లకే కష్టాలు తెస్తాడమ్మా" అని పల్లవిని దార్చుతాడు మాస్టారు.పల్లవితో పాటు ఇంటికి వెళ్లి తన తల్లిని హాస్పటల్లో చేర్పిస్తారు. వైద్యానికి డబ్బులు కూడా మాస్టారే కడతారు. "పల్లవి ఇక నుండి నువ్వు పనికి వెళ్లాల్సిన పనిలేదు. పాఠశాలకు రా! నీకేమైనా ఖర్చులకు డబ్బులు కావాలంటే నన్ను అడుగు ఇస్తాను" అని అన్నారు. ఆ రోజు నుండి పల్లవి ప్రతిరోజు పాఠశాలకు వెళ్ళేది.పల్లవి బాగా చదువుకుని పెరిగి పెద్దదయింది. అప్పుడప్పుడు హాస్పిటల్ కి వెళ్లి తన తల్లిని చూసుకునేది. పల్లవి డాక్టర్ అయింది .తన ఊరిలోనే హాస్పిటల్ నిర్మించి ఊరి ప్రజలకు ఉచిత వైద్యము అందించసాగింది. తల్లికి ఆరోగ్యం కుదుటపడింది.లక్ష్మి చాలా సంతోషించింది.

-ఖర్జూరపు చరిత

# నిజాం వెంకటేశం స్మారక అవార్డు విజేతలు



మారోజు దేవేంద్ర
"తెలంగాణ కథావర్తనం "



గజ్జెల రామ కృష్ణ
చంద్రుడు లేని ఆకాశం కవితా సంపుటి



గోపాగాని రవీందర్
శతారం కవితా సంపుటి



ఆచార్య వంగరి త్రివేణి,
కళల విభాగ పీఠాధిపతి, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్

## నవంబర్ 14న విజేతలకు సత్కారం



శీర్పి చంద్ర శేఖర్(17)
కాలుతున్న వెన్నెల కవితా సంపుటి



హైదరాబాద నవంబర్ 03 (ప్రజా మంటలు) : సుప్రసిద్ధ సాహితీవేత్త, అనువాదకులు, సాహిత్య ప్రేమికులు నిజాం వెంకటేశం స్మారక సాహిత్య పురస్కార' ప్రకటనకు కవులు,రచయితల నుండి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 50 పుస్తకాలకి పైగా వచ్చాయి. బి.ఎస్.రాములు, సామాజిక తత్వవేత్త, ఆడెపు లక్ష్మీ పతి ( సీనియర్ సాహితీవేత్త), సి హెచ్ వి ప్రభాకర రావు ( సీనియర్ జర్నలిస్టు) ఎ, గంగారెడ్డి ( ఏడీఈ రిటైర్డ్), కోడం పవన్ కుమార్ ( సీనియర్ రచయిత). డాక్టర్ వింజమూరి సూర్య ప్రకాష్( అందరి ఇల్లు) గార్లతో కూడిన న్యాయ నిర్ణేతల బృందం, తగిన వ్యవధి తీసుకుని పుస్తకాలను పరిశీలించింది. ఉత్తమ విమర్శా గ్రంథంగా ఎంపిక చేయడానికి,అన్ని సాహిత్య ప్రక్రియల వర్తమాన తీరుతెన్నులను సమగ్రంగా వివేచించిన, విశ్లేషించిన వ్యాసాలతో కూడిన ఒక్క పుస్తకం కనపడక పోవడం కొంచెం నిరాశ కలిగించింది. అలాంటివి రెండు మూడు కనిపించినా అవి తాము నిర్దేశించుకున్న ప్రమాణాలకు అనుగుణంగా లేవని కమిటీ అభిప్రాయ పడింది. 1.అన్ని సాహిత్య ప్రక్రియలను పట్టించుకుని రాసిన సాహిత్య విమర్శ గ్రంధాలు రాలేదు. 2.ఇతర ప్రాంతాల సాహిత్య విమర్శలో తెలంగాణ ప్రాంత సాహిత్యం గాని , సాహితీ వేత్తలను గాని పట్టించుకున్న రచనలు గ్రంథాలు రాలేదు. 3. సాహిత్య విమర్శ ప్రక్రియలవారీగా వచన కవిత్వం. కథ, దళిత బహుజన సాహిత్యం, స్త్రీల సాహిత్యం, అంటూ సాహిత్య విమర్శ గ్రంథాలు పరిశీలన కు వచ్చాయి. 4. అందువల్ల ప్రక్రియల వారీగా పురస్కారాలకు ఎంపిక చేయాల్సిన అనివార్యత ఏర్పడింది. 5. ప్రక్రియల వారీగా విభజించి పురస్కారాల సంఖ్య పెంచాము. అలా విజేతలుగా వీరు ఎంపికయ్యారు: 1..భరిణ(స్త్రీల రచనలపై సాహిత్య వ్యాసాలు)– డా. వి. త్రివేణి , 2.తెలంగాణ కథావర్తనం(కథా సాహిత్య విమర్శ)– డా.ఎం.దేవేంద్ర3. శతారం (వచన కవిత్వ విమర్శ వ్యాసాలు) –గోపగాని రవీందర్. ఒక సాహిత్య విమర్శ గ్రంథానికి 10 వేలు అనుకున్న అవగాహన మార్చుకుని ఈ ముగ్గురికి 5 వేలు రూపాయల చొప్పున మూడు గ్రంథాలకు అంద జేయడం జరుగుతుంది. యువ రచయితల కవితా సంపుటాలలో "చంద్రుడు లేని ఆకాశం"(కవిత్వం)–గజ్జెల రామకృష్ణ పుస్తకం 5 వేలు రూపాయల పురస్కారానికి ఎంపికైంది.కాగా, కాలుతున్న వెన్నెల (కవిత్వం) –శీర్పి చంద్రశేఖర్.17 ఏళ్లకే రాసి పుస్తకం వేయడం మిమ్మల్ని ఆకర్శించింది. అందుకు ప్రోత్సాహక బహుమతి అందజేయడానికి నిర్ణయించాము. సత్కార కార్యక్రమ వేధిక ఈ పురస్కారాల సభ నిజాం వెంకటేశం జన్మదినమైన 14 నవంబర్ 2023 నాడు ఉదయం 11–0 0 గంటలకు నిజాం వెంకటేశం గారి స్వగృహ ప్రాంగణం ( బెల్వెడేరా అపార్టు మెంట్లు , పద్మారావు నగర్ సికింద్రాబాద్ లో జరిగే పురస్కారాల సభలో నగదుతో పాటు మెమెంటో శాలువాతో సత్కరించడం జరుగుతుంది. సభానంతరం భోజనం ఏర్పాటు ఉంటుంది. తొలిసారి ప్రవేశ పెట్టిన నిజాం వెంకటేశం స్మారక సాహిత్య విమర్శ పురస్కారానికి రచనలు పంపి, సాహిత్య విమర్శ ఎలా సాగుతు న్నదో అవగాహన కలిగించిన సాహిత్య విమర్శకులకు ధన్యవాదాలు. పురస్కార విజేతలకు అభినందనలు కమిటీ తరపున బి ఎస్ రాములు, సురుకంటి గంగారెడ్డి, అదెపు లక్ష్మీపతి అభినందనలు తెలిపారు.

prajamantalau daily pages (04-11)f_times of varha main (13-2).qxd 11/4/2023 2:00 AM Page 4



## కాంగ్రెస్‌లో చేరిన తుమ్మేటి సమ్మిరెడ్డి



**జమ్మికుంట నవంబర్ 03 (ప్రజామంటలు):** హైదరాబాద్ నియోజకవర్గానికి చెందిన టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి గత రెండు రోజుల క్రితం టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యాడు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సమ్మిరెడ్డికి తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మేటి సీఎల్పీ లీడర్ మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిల శ్రీధర్ బాబు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బలమూరు వెంకట్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## గడప గడపకు గులాబీ దళం



**కోరుట్ల /కథలాపూర్ నవంబర్ 03 (ప్రజామంటలు):** రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డిలి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ ను మూడోసారి ముఖ్యమంత్రి చేయడం కోసం మరియు వేములవాడ బి ఎస్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చేల్మడ లక్ష్మీనరసింహారావు ను భారీ మెజారిటీతో గెలిపించడం కోసం ఈరోజు వేములవాడ నియోజకవర్గము కథలాపూర్ మండల మాజీ ఎంపీపీ లోక భువనేశ్వరి శేషింధర్ ల ఆధ్వర్యంలో భూషణ్ రావు పెట్ లో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో వేములవాడ బిఆర్ఎస్ అభ్యర్థి అయినటువంటి చల్మడ లచ్చన్న గెలుపు కొరకు ఇంటింటా ప్రచారం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి లచ్చన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారంలో భూషణ్ రావు పేట్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల మాజీ ఎంపీపీ లోక భువనేశ్వరి శేషింధర్, గ్రామ ఎంపిటిసి కొండ ఆంజనేయులు, మండల రైతు సమితి సభ్యులు మహేందర్, మరియు గ్రామ బూత్ కమిటీ అధ్యక్షులు మరియు గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నవ్వి పోదురు గాక.. నాకేంటి..!

### ఎన్నికల నామ సంవత్సరంలో
### ఆయారాం.. గయారాంల జోరు ..



**భూపాలపల్లి ప్రతినిధి నవంబర్ 03 (ప్రజామంటలు):** సాధారణంగా ప్రతి ఏటా మూడు సీజన్ (ఎండా, చలి, వర్షం) లు ఉంటాయి. కానీ ప్రతీ అయిదు ఏళ్లకోసారి సరికొత్త సీజన్ వస్తుంటుంది. అదే ఎన్నికల సీజన్. ఈ సీజన్ వచ్చిందంటే చాలు వాళ్ళకి పండగే. ఎన్నికల అన్ని రోజులు వారి హవా అంతా ఇంతా కాదు. కార్లు, ఖద్దరు అంగీలు, బీర్లు బిర్యానీలతో విందులు అబ్బో వాళ్ళ వైభోగం సామాన్యమైనది కాదనుకోండి. అబ్బా ఏమా సీజన్ ఎవరా వీరులు అనుకుంటున్నారా! వారే నండి జంప్ జిలానీలు, అదే పలు పార్టీల్లోకి మారే ఆయా రాం గయారాంలు. నవ్వి పోదురు గాక నాకేంటి అన్నరీతిన కండువాలు మార్చేస్తున్నారు. మంథని నియోజక వర్గంలోని కాటారం మండలానికి చెందిన ఒక సర్పంచ్ తాను గెలిచిన పార్టీని వదిలి మరో పార్టీలో చేరడం, తీరా రెండు గంటల్లోనే తిరిగి పాత పార్టీలోకి చేరడం చూసి ఔరా! అంటూ ముక్కున వేలేసుకోవడం ప్రజలవంతైంది.

# నా ఆరాధ్యదైవం శ్రీరాముడు

### జగిత్యాల పట్టణంలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ ఖాయం
### ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**జగిత్యాల నవంబర్ 03 (ప్రజామంటలు):** పట్టణంలోని ఇందిరా భవన్లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి శుక్రవారం జగిత్యాల పట్టణ ముఖ్య కార్యకర్తలు, నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారం, వ్యూహాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్రెడ్డి మాట్లాడుతూ.... కాంగ్రెస్ చేపట్టే కార్యక్రమాలు వివరించాలి. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తోంది. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా ముమ్మరంగా ప్రచారం చేస్తుండడంపై జీవన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జగిత్యాల పట్టణంలో కాంగ్రెస్కు మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నా ఆరాధ్య దైవం శ్రీరామ చంద్రమూర్తి.. ఈ నెల 7న మంగళవారం నామినేషన్ వేస్తామని, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాల కోసం కాంగ్రెస్ పార్టీ అధిక నిధులు వెచ్చించిందని గుర్తు చేశారు. ఎదుటి మతాలను గౌరవించేవారే తన మతాన్ని గౌరవిస్తారని అన్నారు. అభివృద్ధి ప్రజల హక్కు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మా జన్మహక్కు అని నినదించినం. రాజీవ్ ఆరోగ్యశ్రీతో ఉచిత వైద్యం అందించామన్నారు. నిత్యావసర వస్తువులు రేషన్ కార్డులు ఇచ్చినం. నేడు ఇళ్ల నిర్మాణం చేపడితే నేడు ఇళ్ల నిర్మాణాలు లేవు. నిబద్ధత గల పార్టీ కాంగ్రెస్ పార్టీ. దళితులకు కేటాయించిన నిధులు అవే సంవత్సరంలో నిధులు వెచ్చిస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలన్ని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

# కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం




**ధర్మపురి నవంబర్ 03 (ప్రజామంటలు):** అంబేడ్కర్ చౌక్ వద్ద దళిత నేతలు, సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్య మంత్రి కేసి అర్, మంత్రి ఈశ్వర్ చిత్రపటాలకు పాలభిషేకం జరిపారు. హుజూరాబాద్ లో ఇచ్చిన విధంగా ధర్మపురి నియోజకవర్గం లోని దళితులకు వలె వంద శాతం దళిత బందు అమలు చేస్తామని ముఖ్యమంత్రి నిన్న జరిగిన ఆశీర్వాద సభలో చేసిన ప్రకటనను హర్షిస్తూ దళిత ప్రజా ప్రతినిధులు, సంఘాల ఆధ్వర్యంలో సి.ఎం. కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అంతకుముందు బిఅర్ఎస్ కార్యాలయం వద్ద సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో ధర్మారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆవుల శ్రీనివాస్ తో పాటు ధర్మారం మండలం లోని ఎర్రగుంటపల్లె, గోపాల్ రావు పేట, చామనపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరగా మంత్రి వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## మర్యాద పూర్వక కలయిక



**కోరుట్ల /కథలాపూర్ నవంబర్ 03 (ప్రజామంటలు):** నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ను మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి. వారి వెంట కథలాపూర్ మండల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్ రావు, బొమ్మెన గ్రామ సర్పంచ్ పిడుగు లావణ్య - తిరుపతి తక్కళ్ళ పెల్లి గ్రామ సర్పంచ్ మొలిగే లక్ష్మీ - శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## టి-సెర్ప్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం






**చిగురుమామిడి నవంబర్ 03 (ప్రజామంటలు):** టి -సెర్ప్ ఆధ్వర్యంలో చిగురుమామిడి, ఇందుర్తి, బొమ్మనపల్లి గ్రామాల లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగింది. చిగురుమామిడిలో తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఎంపిడిఓ మామిడాల నర్సయ్య, ఎఓ రంజిత్ రెడ్డి ఏపీఎం మట్టెల సంపత్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కోల హరిణి ప్రారంభించడం జరిగింది. ఇందుర్తిలో విఓ అధ్యక్షురాలు బండెల మల్లవ్వ ,బొమ్మనపల్లి లో విఓ అధ్యక్షురాలు కాంపెల్లి అరుణ ప్రారంభించారు. తహసిల్దార్ మాట్లాడుతూ.... ధాన్యం ఆరబెట్టి తాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వ మద్దతు ధర "ఏ" గ్రేడ్ క్వి రూ. 2203లు కామన్ గ్రేడ్లు రూ 2183 పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసీ లు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకట మల్లయ్య, చిగురుమామిడి విఓ అధ్యక్షురాలు పోలోజు చైతన్య, ఆయా గ్రామాల వివోఏలు, కమిటీ సభ్యులు రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

# ఆయుర్వేదంతో ఆరోగ్యం..



**సికింద్రాబాద్ నవంబర్ 03 (ప్రజామంటలు):** ప్రాచీన వైద్యం ఆయుర్వేదంతో అనేక వ్యాధు లు సకలంలో నయం అవుతాయని, ఆయుర్వేదంతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లు కూడ ఉండవని ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ వర్ధిని అన్నారు. అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం (నవంబర్ 10) ను పురస్కరించుకొని శుక్రవారం వారాసిగూడ లోని సెయింట్ జాన్స్ హైస్కూల్లో ఆయుర్వేద వైద్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పలు అనారోగ్య సమస్యలకు సహజసిద్ధమైన పద్ధతులతో చేయాల్సిన వైద్యం, సలహాలు, సూచనలను డాక్టర్ వర్ధిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్, తెలుగు టీచర్ సుధాకర్, ఆర్య సమాజ్ ప్రతినిధి డి. జయరాజ్ ఆర్య, స్టూడెంట్లు పాల్గొన్నారు.

### జగిత్యాలలో నామినేషన్ వేసిన
## పిరమిడ్ పార్టీ అభ్యర్థి డా. సత్యనారాయణ మూర్తి




**జగిత్యాల నవంబర్ 03 (ప్రజామంటలు):** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా జగిత్యాలలో శుక్రవారం పిరమిడ్ పార్టీ అభ్యర్థి జగిత్యాలకు చెందిన డా. సత్య నారాయణ మూర్తి తన నామినేషన్ దాఖలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిరమిడ్ పార్టి ఏ ప్రధాన పార్టీలకు పోటీ కాదు - ప్రత్యామ్నాయం మాత్రమే. సంపూర్ణ ఆరోగ్యమే మా లక్ష్యం. దానికి మేము ఎంచుకుంది ధ్యానం, శాకాహారం నినాదం. ధ్యానం చేసి మనశాంతిగా, శాకాహారం తిని ఆరోగ్యంగా ఉండాలన్నారు. దీన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వైద్యరంగం కన్న రాజకీయరంగం ఉత్తమం అని భావించి ఈ నిర్ణయం తీసుకోవడంజరిగిందని పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎం.పి. గా పోటీ చేసి ధ్యానం, శాఖాహారం పై ప్రచారం చేయడం జరిగిందన్నారు. సమసమాజం స్థాపన కోసం ముందుకు వెళ్తున్నామని హింస చొడో - హంస పకుడో అనే నినాదంతో ముందుకు వెళ్తాం అన్నారు. ప్రలోభాల నిర్మూలన, ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా పిరమిడ్ పార్టి ముందుకు సాగుతుందని అన్నారు.

## గొర్రెలు, మేకలకు ఉచిత వ్యాధి నివారణ టీకాలు



**గొల్లపల్లి నవంబర్ 03 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండల కేంద్రంలో తిర్మలాపూర్ (పీడీ) రంగ దామునిపల్లి గ్రామాలలో గొర్రెలు, మేకలకు ఉచిత పిపిఆర్ (పారుడు రోగం) వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమం ను జిల్లా పశు వైద్య పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బోనగిరి నరేష్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ టీకాలు 3 నెలల పైబడిన అన్ని గొర్రెలు మేకలలో వేయించికోవాలని మరియు గొర్రెల పెంపకం లోని సాంకేతికత ను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యధికారి డాక్టర్ రవీందర్, సిబ్బంది మధుమోహన్, మెటీన్, సంధ్య, రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఈ ఎన్నికలలో గౌడ కులస్తుల దారెటు..?



### అధికార పార్టీ వైపా?
### గౌడ కుల అభ్యర్థి వైపా?

**చిగురుమామిడి నవంబర్ 03 (ప్రజా మంటలు):** చిగురుమామిడి మండల బొమ్మనపల్లి గ్రామంలో ఈరోజు గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు తాళ్లపల్లి తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘం మండల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో ముఖ్య నాయకులు మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో రెండు సార్లు గౌడ కులస్తుల మద్దతు గౌరవ ఎమ్మెల్యే సతీష్ కుమార్ గెలుపొందగా మూడోసారి మళ్లీ ఎన్నికలలో పోటీకి చేయడం జరుగుతుంది మరి కాంగ్రెస్ పార్టీ తరపున గౌడ కులస్తుడైన బీసీ బిడ్డగా పొన్నం ప్రభాకర్ గౌడ్ హుస్నాబాద్ నియోజకవర్గం నుండి ఎన్నికల లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉండగా మరి మండల గౌడ కులస్తులలో కుల సెంటిమెంటు ప్రచారం జరుగుతుంది. గతం నుండి కూడా బి.ఆర్. ఎస్. పార్టీలో గౌడ కులస్తులకు సరైన ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల మండల గౌడ సంఘం గుర్రుగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పొన్నం ప్రభాకర్ వైపే మొగ్గు చూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## హుజురాబాద్ నియోజకవర్గ ఎలక్షన్ ఇన్చార్జిగా ఇమ్రాన్



**జమ్మికుంట నవంబర్ 03 (ప్రజామంటలు):** ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఇమ్రాన్ ని హుజురాబాద్ నియోజకవర్గ ఎలక్షన్ ఇన్చార్జిగా నియమిస్తూ ఎన్ ఎస్ యు ఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు జిల్లా ఇన్చార్జ్ ఎస్‌వై. థామస్ లు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. అసెంబ్లీ ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికై డిస్టిక్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది అని తెలిపారు. ఈ నియామకంపై ఎండి ఇమ్రాన్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యత నాకు అప్పగించినందుకు ఎస్‌వై థామస్ కు, మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్ కు, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లీ సత్యనారాయణ కు, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడితల ప్రణవ్ కు మరియు తెలంగాణా రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు బల్మూరి వెంకట్ కు ధన్యవాదాలు తెలుపుతూ వాళ్లు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని సోనియా గాంధీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను హుజురాబాద్ నియోజకవర్గం లోని గడపగడపకి తీసుకు వెళ్తానని, నా వంతు నేను కృషి చేస్తానని, కష్టపడి కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గంలో గెలుపొందేలా చేస్తానని విలేకరుల సమావేశంలో తెలిపారు.

# నా వెంట మీరుంటే..
# మీ కష్టసుఖాల్లో నేనుంటా..

## ఎంఎల్సి కౌశిక్ రెడ్డి



**జమ్మికుంట నవంబర్ 03 (ప్రజామంటలు):** ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మీరంతా నా వెంట ఉండి నన్ను గెలిపిస్తే మీ కష్టసుఖాల్లో నేను ఉంటా అని ఎమ్మెల్సీ నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. గత 15 సంవత్సరాలుగా నియోజకవర్గంలోనే ఉంటూ ఏ ఇంట్లో కష్టమొచ్చిన మీరు ఏడిస్తే ఏడ్చాను నవ్వితే నవ్వాను అని అన్నారు. ఇప్పుడు మీరే నా బలం మీరే నా బలగం అని మీరు నా వెంట ఉంటే ఎంత దూరమైనా వెళ్తానని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలోని ఇల్లంతకుంట తోపాటు శ్రీరాములపల్లి, కనపర్తి, లక్ష్మాజి పల్లి, మల్యాల గ్రామాల ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఇల్లంత కుంటను టెంపుల్ సిటీగా ప్రకటించామని, దీంతో పాటు ఇల్లంతకుంట రామాలయాన్ని మినీ యాదగిరిగుట్టగా మారుస్తానన్నారు. బీరన్న గుడికి కూడా 10 లక్షలు కేటాయించమన్నారు. ఇల్లంతకుంట పాత శివలయాన్ని కొత్తగా మారుస్తా అన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా రైతులకు 19 వేల కోట్ల రుణమాఫీ చేసిన గొప్ప నాయకుడని అన్నారు. ఇప్పటికే 14 వేల కోట్లు రుణమాఫీ చేశాడని మిగిలిన 5000 కోట్లు కూడా వారం పది రోజుల్లో రుణమాఫీ చేస్తాడని అన్నారు. రైతుల శ్రేయస్సు కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేసి వారి ఎదుగుదలకు కారణమయ్యాడని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి ఇప్పటివరకు ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేసి ప్రజల మనసు గెలుసుకున్నాడ న్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం ఎప్పుడు ఆలోచించి బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ మరోసారి పేద ప్రజల కోసం మేనిఫెస్టో రూపొందించారని, ఈ మేనిఫెస్టో పేదల కుటుంబా ల్లో వెలుగులు నింపుతాయన్నారు. మేనిఫెస్టోలో సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు 3000 రూపాయలు అందించడంతోపాటు ఆరోగ్యశ్రీని 15 లక్షల పెంచుతామని అన్నారు.

దీంతోపాటు ప్రతి కుటుంబానికి కెసిఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా అనే పథకం తో 5 లక్షల ఉచిత బీమా అందిస్తూ గ్యాస్ సిలిండర్ ని కూడా 400 కి అందించనున్నామన్నారు. గత ఏడుసార్లు ఇక్కడి ఎమ్మెల్యే ఈటలకు అవకాశం కల్పించిన హుజురాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయాడని, నాకు ఒకే ఒక్క అవకాశం ఇస్తే హుజురాబాద్ రూపు రేఖలు మార్చి చూపిస్తానని అన్నారు. హుజురాబాద్ని సిద్దిపేట తరహాలో అభివృద్ధి చేసి చూపిస్తానని, అలా చేయకుంటే మరోసారి మీ ముందుకు వచ్చి ఓటు కూడా అడగనని అన్నారు. దీంతోపాటు నియోజకవర్గంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో పాటు కుల భవనాలు, మహిళా భవనాలతో పాటు రోడ్లు ,డ్రైనేజీలు అన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా గృహలక్ష్మి, బిసి లోన్లు పెట్టుకున్న వారికి కూడా అందరికీ అమలు చేస్తున్నామని, డిసెంబర్ 3 తర్వాత చెక్కులు కూడా పంపిణీ చేస్తామని అన్నారు. వేరువేరు గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో జెడ్పి చైర్పర్సన్ కనుమల్ల విజయ, ఎంపీపీ పావని వెంకటేష్, ఇల్లంతకుంట గ్రామ అధ్యక్షుడు విక్రమ్, ఎంపీటీసీ కుమార్ కొమురెల్లి, శ్రీరాములపల్లి సర్పంచ్ మొగిలి, గ్రామ అధ్యక్షుడు రవీందర్, ఉప సర్పంచ్ ఆగన్న, కనపర్తి గ్రామ సర్పంచ్ మట్ట రజిత వాసుదేవ రెడ్డి, ఎంపిటిసి రమ, నాయకులు దరువుల రాకేష్ లతో పాటు నాయకులు కార్యకర్తలతో పాటు అధిక సంఖ్య ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా బాస్కెట్ బాల్ జట్లకు కిట్స్‌ను అందజేసిన డా. వేణుగోపాల్ రెడ్డి



**జగిత్యాల నవంబర్ 03 (ప్రజామంటలు):** హైదరాబాదులో ఈనెల 4, 5 తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్లో పాల్గొను జగిత్యాల జిల్లా బాల బాలికల జట్లకు క్రీడా దుస్తులను డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి అందజేశారు. వేణుగోపాల్ విశ్వప్రసాద్, నిరంజన్, డా. రవికుమార్, కృష్ణ ప్రసాద్, అజయ్ బాబు, వేణు, శ్రీరామ్, హరీష్ సీనియర్ క్రీడాకారులు అనిల్ న్యాయవాదులు రేపల్లె హరికృష్ణ, భూమి రమణ, బండ శంకర్ పాల్గొన్నారు.

## రేపు మేడిబావిలో ఉచిత వైద్య శిబిరం



**సికింద్రాబాద్ నవంబర్ 03 (ప్రజామంటలు):** వారాసిగూడ ఇందిరానగర్ లోని ఆరోగ్య వర్ధిని ఆయుర్వేద క్లినిక్ ఆధ్వర్యంలో ఈనెల 5 ఆదివారం మేడిబావి ఆర్యసమాజ్ ఆవరణలో ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వర్ధిని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిభిరంలో పేషంట్లకు పలు ఆరోగ్య సూచనలు, సలహాలతో పాటు నడుం, కాలి నొప్పులు, తదితర ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్యం, మందులను ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సీతాఫల్మండి, వారాసిగూడ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ వర్ధిని, ఆర్య సమాజ్ ప్రతినిధి జయరాజ్ ఆర్య విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ టాప్

### రాష్ట్ర మంత్రి తలసాని



**సనత్ నగర్ నవంబర్ 03 (ప్రజామంటలు):** అత్యధిక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతో తెలంగాణా రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని చూరగొన్న బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రాబోతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం బన్సీలాల్ పేట డివిజన్ సీ క్లాస్ కు చెందిన 15 మంది యువకులు వెస్ట్ మారేడ్ పల్లిలోని నివాసంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సీ క్లాస్ కు చెందిన బీఆర్ఎస్ నేత జ్ఞాని ఆధ్వర్యంలో సంజీవ్, జగదీశ్, కార్తిక్, వినోద్, సునీల్, రామ్ తదితరులు పార్టీలో చేరారు. వీరందరికి కండువా కప్పిన మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు.

## బిజెపి ప్రచార రథానికి పూజ చేసిన మండల అధ్యక్షుడు బట్టు జకరయ్య



**ఇబ్రహీంపట్నం నవంబర్ 03 (ప్రజామంటలు):** మండలంలోని అమ్మక్కపేట గ్రామంలోని హనుమాన్ టెంపుల్ లో ఉదయం 10 గంటలకు కోరుట్ల బిజెపి అసెంబ్లీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ ప్రచార రథానికి పూజ చేసి ప్రారంభం చేసిన మండల అధ్యక్షులు బట్టు జకరయ్య, మండల ఇంచార్జి సదాశివ్, ఇబ్రహీంపట్నం మండల మాజి జెడ్పిటిసి జె యన్ సునీత దేవి. వీరితోపాటు భారతీయ జనతా పార్టీ ఇబ్రహీంపట్నం మండల కార్యకర్తలు నాయకులు, మోర్చా అధ్యక్షులు, జిల్లా నాయకులు, శక్తి కేంద్ర ఇన్చార్జీలు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## షురూ అయిన నామినేషన్లు

### తొలిరోజు రెండు నామినేషన్లు





**భూపాలపల్లి ప్రతినిధి నవంబర్ 03 (ప్రజామంటలు):** అసెంబ్లీ ఎన్నికల్లో భాగమైన తొలి అంకం నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం షురూ అయ్యింది. తొలిరోజు మంచి ముహూర్తం దృష్ట్యా భూపాలపల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ అభ్యర్థిని చందుపట్ల కీర్తిరెడ్డి తన అనుచరులతో వచ్చి సాదా సీదా గా నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు తరపున ఆయన సతీమణి గణపురం జడ్పిటిసి నామినేషన్ దాఖలు చేశారు.

## వొడితల ప్రణవ్ గెలుపు కోసం బిజిగిరి షరీఫ్ దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు

**జమ్మికుంట నవంబర్ 03 (ప్రజామంటలు):** హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్ బాబు వచ్చే అసెంబ్లీ ఎన్నిక లలో హుజురాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలవాలని అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని హుజురాబాద్ ముస్లింలందరి తరపున బిజిగిరి షరీఫ్ దర్గాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండీ తౌసీఫ్, అలీం, రఫీ, నవాబ్, సలీం, జియా, సల్మాన్, హది, అన్వర్, రియాజ్, సాధిక్, మూకీడ్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.




## బిజెపి పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన యువత సీనియర్ నాయకులు



**మహదేవపూర్ నవంబర్ 03 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సర్పంచ్ శ్రీపతి బాపు ఆధ్వర్యంలో మహాదేవపూర్ బిజేపి పార్టీకి చెందిన సుమారు 50 మంది యువత సీనియర్ నాయకులు మంథని నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. చేరిన వారిలో కారెంగుల రామకృష్ణ, పోతుల వంశీకృష్ణ, అట్టెం రాజేందర్, ఊదరి సురేష్, నీలారపు మహేందర్, రామ్ శెట్టి రాకేష్, కల్వపల్లి అరవిందర్, శ్యామల ప్రణీత్, పెద్దింటి మధుకర్, శ్రీశైలం లక్ష్మీనారాయణ, లింగాల నిరంజన్, కడార్ల రాజేష్ ఉన్నారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ.... పార్టీలకు అతీతంగా నన్ను ఆదరిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని ప్రజల నుండే నిశ్శబ్ద విప్లవం పుట్టిందని ఆ విప్లవం నియోజకవర్గం మంతా చెందిందనే దానికి మహాదేవపూర్ యువతనే సాక్ష్యం అని అన్నారు.

## ఇంటింటికి కేసీఆర్ మేనిఫెస్టో ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు



**మహదేవపూర్ నవంబర్ 03(ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో సర్పంచ్ శ్రీపతి బాపు ఆధ్వర్యంలో కెసిఆర్ మేనిఫెస్టో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు కారు గుర్తు ప్రచారం జోరుగా సాగుతుంది. మధన్న లాంటి నాయకుడు మన ఎమ్మెల్యే ఐతే అందుబాటులో ఉంటాడని తనదైన శైలిలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు అలిం ఖాన్, మహిళా విభాగం నియోజకవర్గ ఇంచార్జి కేదారి గీత, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కుంభం పద్మ, సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మొదటి రోజు ఒక్క నామినేషన్

### స్వతంత్ర అభ్యర్థిగా దూడ మహిపాల్



**ధర్మపురి నవంబర్ 03 (ప్రజామంటలు):** ధర్మపురి శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జగిత్యాల అడిషనల్ కలెక్టర్ దివాకర టి.ఎస్. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎన్నికల షెడ్యూలును ప్రకటించారు. ధర్మపురి తహశీల్దార్ కృష్ణ చైతన్య, బుగ్గారం అబ్దుల్ మాజీద్, ధర్మారం రజిత, ఎండపెల్లి ఉదయ్ కుమార్, గొల్లపెల్లి ఆరిఫోద్దిన్, పెగడపెల్లి ఫారూఖ్, వెల్గటూర్ శేఖర్ లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా, రిటర్నింగ్ అధికారి దివాకర శుక్రవారం ధర్మపురి తహశీల్దార్ కార్యాలయంలో వలసిన ఏర్పా ట్లను సరి చూసుకుని, నామినేషన్ల స్వీకరణకు ఉపక్రమించారు. అయితే శుక్రవారం తొలి రోజు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (స్వతంత్ర) అభ్యర్థిగా దూడ మహిపాల్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

## నేడు శ్రీతుల్జా భవానీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

**సనత్ నగర్ నవంబర్ 03 (ప్రజామంటలు):** బన్సీలాల్ పేట డివిజన్ ఐడీహెచ్ కాలనీలో శ్రీతుల్జా భవానీ దేవాలయంలో ఈనెల 4 శనివారం శ్రీతుల్జా భవానీ అమ్మవారి విగ్రమా ప్రతిష్ట వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ ప్రెసిడెంట్ శేట్ల అంబిక ముదిరాజ్, రజనీష్ లు తెలిపారు. ఈసందర్భంగా వేద పండితులతో ఆలయంలో బలిపీఠము, పోత లింగము, నాగ దేవత లను ప్రతిష్ట చేస్తామన్నారు. దేవాలయ పునర్నిర్మాణ దాత రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్లమెంటరీ ఇంచార్జీ తలసాని సాయి కిరణ్ యాదవ్ లు ఈ మహెూత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజ కార్యక్రమాలకు హాజరై అమ్మవారి కరుణా, కటాక్షలకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.



శాసనసభ ఎన్నికలలో భాగంగా జగిత్యాల జిల్లా గ్రామీణ మండలం ధరూర్ గ్రామంలో ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఆరు హామీల అభయహస్తం పథకం అమలు గురించి వివరిస్తూ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి టి. జీవన్ రెడ్డి ని భారీ మెజారిటీ తో గెలిపించి శాసనసభ కు పంపించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

prajamantalau daily pages (04-11)f_times of varha main (13-2).qxd 11/4/2023 2:00 AM Page 6



## ఉప్పల్ భగాయత్‌లో జరిగే విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహాజన సభ



జనగామ నవంబర్ 03 (ప్రజామంటలు): జనగామ జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు ఇకనుండి జిల్లాలో ఒకే సంఘంగా పని చేస్తుందని శుక్రవారం జనగామలో జరిగిన సమావేశంలో తీర్మానించారు. ఉప్పల్ భగాయత్ లో జరిగే విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహాజన సభ జయప్రదం చేయాలని నాయకులు కోరారు. జనగామ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ సోదరులు హక్కుల సాధనకై పోరాడే సమయం ఆసన్నమైందని అన్నారు. ఈనెల 5 ఆదివారం మధ్యాహ్నం 2:00 గంటలకు జరగబోయే మన విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఆత్మగౌరవ సభకు జిల్లాలోని అన్ని మండల విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నారోజు రామేశ్వర చారి, దీగోజు నరసింహచారి, దిగోజు సాంబయ్య చారి, మారోజు ఆనందచారి, పొన్నోజు రతన్ చారి, ముమ్మడి నరసింహచారి, సరబోజు రాజుచారి, సాతెల్లి రాజుచారి, చెన్నోజు నగేష్, వలబోజు చక్రపాణి, కాలూరి మల్లికార్జున్ చారి, పుల్లోజు కృష్ణమూర్తి చారి, గొట్టిముక్కల లక్ష్మయ్య చారి, మద్దోజు మహేంద్ర చారి, కాసోజు సంతోష్, మరియు మహిళలు పొత్కనూరి మంజుల, వుల్లోజు భాగ్యలక్ష్మి, బండ్ల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లాలో మొదలైన నామినేషన్ల స్వీకరణ




జనగామ నవంబర్ 03 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు- 2023లో భాగంగా నామినేషన్ల స్వీకరణ శుక్రవారం ప్రారంభమైంది. మొదటిరోజు పాలకుర్తి నియోజక వర్గం నుండి తొర్రూరు మండలం, నాంచారి మడూరు గ్రామానికి చెందిన మంద యాకమల్లు, స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం నుండి తాటికాయల గ్రామానికి చెందిన బల్లెపాక రాజేష్, స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. జనగామ నియోజకవర్గం నుండి ఎవరు నామినేషన్ దాఖలు చేయలేదు.

## జనగామలో వందే విశ్వమాతరం శాంతి సద్భావన యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



జనగామ నవంబర్ 03 (ప్రజామంటలు): జనగామ జిల్లాలో "వందే విశ్వమాతరం" శాంతి సద్భావన యాత్ర పోస్టర్ ను జనగామ జిల్లా వందే విశ్వమాతరం తానా సమన్వయకర్త బుదారపు లావణ్య అధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.... తానా ఆధ్వర్యంలో నవంబర్ 9 నుంచీ చిగురుమళ్ళ శ్రీనివాస్100 దేశాలలో శాంతి సద్భావనా యాత్ర, రెండేళ్ల పాటు సాగనున్న సాహిత్య, సాంస్కృతిక, సామాజిక చైతన్య ప్రపంచ యాత్ర అని అన్నారు. వంద దేశాలలోని వందకు పైగా తెలుగు సంఘాల సంయుక్త నిర్వహణలో జరుగుతున్న మహా అక్షర యజ్ఞమని తెలిపారు. తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, వందేవిశ్వమాతరమ్ చైర్మన్ జయశేఖర్ తాళ్ళూరి సారథ్యంలో కొనసాగుతుందని అన్నారు. బోట్స్ వానా తెలుగు సంఘం అధ్యక్షులు తోట కూర వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఆఫ్రికా దేశాల యాత్ర సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కల్నల్ డాక్టర్ కల్నల్ బిక్షపతి, జి.వై గిరి ఫౌండేషన్ చైర్మన్ జి.కృష్ణ, జనగామ రచయితల సంఘం అధ్యక్షులు అయిలా సోమనరసింహాచారి, శ్రీ శ్రీ కళావేదిక జనగామ జిల్లా అధ్యక్షులు లభిశెట్టి ప్రభాకర్, జ.ర.సం గౌరవ అధ్యక్షులు పొట్ట బత్తిని భాస్కర్, కవి హృదయం సాహిత్య వేదిక పెట్లోజు సోమేశ్వరా చారి, కొట్టే శ్రీలత, డాక్టర్ వేముల సదానందం, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, గడ్డం మనోజ్ కుమార్ , అంబాల శివనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## 11న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



జనగామ నవంబర్ 03 (ప్రజామంటలు): జనగామ జిల్లా కేంద్రంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిర్రు నగేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈనెల 11న మాదిగల విశ్వరూప మహాసభకు వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వీహెచ్పీ జనగామ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి కుమార్ కోరారు. మహాజన మందకృష్ణ మాదిగ గత 30 ఏళ్లుగా ఏ, బి, సి, డి ల వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాడే క్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పైసా రాజశేఖర్ మాదిగ ఎమ్మెస్ పి జనగాం మండల ఇన్చార్జి నిర్మల భాస్కర్ మాదిగ, నర్మెట ఎంఎస్పి ఇన్చార్జి గువ్వల రవి, మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల మహేష్ మాదిగ, వీహెచ్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగలి నాగేష్, వీహెచ్పీ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం సోమరాజు, జిల్లా నాయకులు తాటికాయల హరికృష్ణ, పత్తి సిద్ధిరాములు, చేపూరి కుమార్, శివునిపల్లి శ్రీనివాస్, రడపాక సత్తయ్య పాల్గొన్నారు.

# సీఎం ప్రకటన సాకారం అయ్యేనా!

### ధర్మపురిలో దళిత బంధు అమలు అయ్యేనా?

### జగిత్యాల డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూటి ప్రశ్న

రామ కిష్టయ్య సంగన భట్ల

ధర్మపురి నవంబర్ 03 (ప్రజామంటలు): ధర్మపురి క్షేత్రంలో గురువారం సీఎం కేసీఆర్ తమ ప్రసంగంలో ... దళిత బంధు గురించి చేసిన ప్రకటన కార్యరూపం దాల్చేనా అన్న సందేహాన్ని జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ వెలిబుచ్చారు. శుక్రవారం తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో అడ్లూరి మాట్లాడుతూ... తమ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ను 70వేల మెజారిటీతో గెలిపిస్తే... హుజురాబాద్ తరహాలో ఒక్క సారి నియోజక వర్గంలో దళితులు అందరికీ దళిత బంధు ఒకే విడతలో అమలు చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. గజ్వేల్, కామారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేటలో ఈ ఎన్నికల్లో 70వేల ఓట్ల మెజారిటీ వస్తుందని కేసీఆర్ భావిస్తున్నారా అని ప్రశ్నించారు. అలాంటపుడు ధర్మపురిలో అంత మెజారిటీ వస్తుందని ఎలా అనుకుంటారని, సీఎం ప్రకటన సాకారం కావడం జరగదని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్... 2016లో పట్టిపాక రిజర్వాయర్ ఏర్పాటు చేసి ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి పేరు పెట్టి సాగు నీటి ఇబ్బందులు తొలగించ గలమని చేసిన ప్రకటన ఏమైందని ప్రశ్నించారు. 2014 ధర్మపురి ఎన్నికల ప్రచార సభలో... తమ పార్టీ అధికారంలోకి వస్తే, ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంకు 500 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇంతవరకు ఎన్ని కోట్లు కేటాయించారో స్పష్టం చేయాలన్నారు. రోళ్ళ వాగు ప్రాజెక్టు ఆధునీకరణ కోసం 2016 లో 60 కోట్ల అంచనాలతో



శంకుస్థాపన చేసిన హరీశ్ రావు, తర్వాత ఏడేళ్లలో 140 కోట్ల అంచనాలకు పెంచారని, అయినా షట్టర్లు బిగించే చర్యలు తీసుకో లేదని విమర్శించారు. ఇప్పటి వరకూ అటవీ శాఖ క్లియరెన్స్ లేదన్నారు. ధర్మపురిలో తెలంగాణ రాష్ట్రం కోసం యాగం నిర్వహించిన ఉద్యమ పార్టీ నేత కేసిఆర్ రాష్ట్రం సాధించాక, యాదాద్రి తరహాలో ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. చెన్నూరుకు ఎమ్మెల్యే సుమన్ బస్ డిపో, రెవెన్యూ డివిజన్ సాధించారని, ధర్మపురి క్షేత్రంపై నిర్లక్ష్యం ఎందుకన్నారు. కాళేశ్వరం లింక్ 2కింద 700 ఎకరాల రెండు పంటల భూములను తీసుకుని, రైతులకు నష్టపరిహారం చెల్లింపు విషయంలో జరిగిన అన్యాయానికి బాధ్యత ఎవరిదన్నారు. ధర్మపురిలో జరిగిన ముఖ్యమంత్రి కెసీఆర్ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ ఏమి అభివృద్ధి చేయలేదని మాట్లాడటం చాలా బాధాకరమని, ధర్మపురిలో ఒక బస్ డిపో గాని, ఒక ఐటిఐ కళాశాల గాని, అధునాతన సదుపాయాలతో ఆసుపత్రి గాని, త్రాగడానికి శాశ్వత నీటి సదుపాయం లేవన్నారు. ముఖ్యమంత్రి కెసీఆర్, స్థానిక మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పే మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేరనని లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగనబట్ల ధినేష్, వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా సరిహద్దులలో చెక్ పోస్టుల తనిఖీ

జనగామ నవంబర్ 03 (ప్రజామంటలు):




జనగామ జిల్లా సరిహద్దులలో చెక్ పోస్టులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య తనిఖీ చేశారు. శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య జనగామ జిల్లా ప్రారంభం అయ్యే పెంబర్తి, జీడికల్లు క్రాస్ రోడ్డు గ్రామలలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు-2023, సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిబంధనల ప్రకారం ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సజావుగా ఎన్నికలు నిర్వహించడానికి జిల్లాకు కేంద్ర బలగాలు వచ్చాయని, అక్రమ మద్యం, డబ్బు తదితర వస్తువులు రవాణా చేయకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని, ప్రతీ వాహనాన్ని పరిశీలించిన పిదపనే వదలాలని సూచించారు. చెక్ పోస్టులలో విడుతల వారీగా సిబ్బంది 24, గంటలు సిబ్బంది విధులు నిర్వహించాలని రిజిస్టర్లు, రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. వీడియో సర్వే లైన్స్ సిస్టం ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చిత్రీకరించాలన్నారు. ఇప్పటివరకు తనిఖీ చేసి సీజింగ్ చేసిన వస్తువులు, డబ్బు తదితర అంశాలపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎన్నికల నోడల్ ఆఫీసర్స్ డిఎంఓ నరేందర్ రెడ్డి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్, మొగులప్ప తదితరులు ఉన్నారు.

## మోటె లక్ష్మి మృతి..నివాళులర్పించిన కాంగ్రెస్



జనగామ నవంబర్ 03 (ప్రజామంటలు): జనగామ పట్టణం 3వ వార్డు బాలాజీ నగర్ లో జనగామ పట్టణ కిసాన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మోటె శ్రీనివాస్ భార్య మోటె లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా పార్థివ దేహానికి పూలమాల వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, పిసిసి మెంబర్ చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వేమళ్ళ సత్యనారాయణ రెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, వడ్లకొండ పిఎస్ సిఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, జనగామ జిల్లా నాయకులు ఉడత రవి యాదవ్, మేడ శ్రీనివాస్, జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్, యశ్వంతపురం ఎంపీటీసీ బాలరాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్ట కృష్ణ, జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల సతీష్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆకుల లక్ష్మయ్య, శామీర్ పేట మాజీ ఎంపీటీసీ మహేందర్, బండారు శ్రీనివాస్, మోర్త ప్రభాకర్, మోటె లింగయ్య, కోట నాయక్, జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ నాంపెల్లి అశోక్, జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ ప్రకాష్, గందమల్ల కమలాకర్, కొమ్మూరి యువ సేన జనగామ మండల అధ్యక్షులు బక్క ప్రవర్దన్, మచ్చ ప్రవీణ్, బైరగోని రఘు గౌడ్, పాముకుంట్ల మణిదీప్, శ్యామ్, అరవింద్, కళ్యాణం సమ్మయ్య, నివాళులర్పించారు.



జగిత్యాల పట్టణంలోని 20వ వార్డులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను మద్దతు కోరిన జగిత్యాల ఎమ్మెల్యే దంపతులు డాక్టర్ సంజయ్ కుమార్, రాధిక మరియు వారి కుమార్తె హార్దిక. వెంట పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు భోగ చిన్న జిఆర్, సిరిపురం మహేందర్, మానపురి శ్రీనివాస్, సర్వేశ్వర్, గడ్డం శ్రీనివాస్ గౌడ్, వార్డు నాయకులు

## టాస్కా సాధించిన విజయాలు అభినందనీయం

### జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్



జగిత్యాల నవంబర్ 03 (ప్రజామంటలు): హైదరాబాద్ లో 11 డిసెంబర్ 2016 న ప్రారంభించబడిన తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ ప్రభుత్వ గుర్తింపు పొంది 2.21 లక్షల సభ్యులతో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింహ రావు ఆధ్వర్యంలో 33 జిల్లా శాఖలతో వయోవృద్ధులకు అండగా నిలవడం అభినందనీయమని జగిత్యాల జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో టాస్కా సేవలు, సాధించిన విజయాలు వివరించే బ్రోచర్ ను జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జగిత్యాల జిల్లాలో టాస్కా రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజెన్లకు చేస్తున్న సేవలు,తల్లిదండ్రులను నిరాదరణకు గురి చేస్తున్న పిల్లలకు కౌన్సెలింగ్ లు చేస్తూ ఆ వయోవృద్ధుల సమస్యలు పరిష్కారం చేస్తున్న తీరు ను కొనియాడారు.ఓటర్ల కు అవగాహన ,వయోవృద్ధుల చట్టం పై అవగాహన సదస్సులు, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వేడుకల్లో అసోసియేషన్ పాత్ర నేను పనిచేసిన ఏ జిల్లాలో కూడా చూడలేదన్నారు. రాష్ట్ర జిల్లా అసోసియేషన్ సేవలు ఆదర్శనీయమన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెళముల ప్రకాష్ రావు, ఉపాధ్యక్షులు పి.సి. హన్మంత్ రెడ్డి, బొల్లం విజయ్, ఎం.డి. యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పి.ఆశోక్ రావు, కె. సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు విట్ఠల్, బొబ్బటి కరుణ, రాజ్ గోపాల్ చారి, సంజీవ రావు, కన్నాపూర్ సుధాకర్, కంద్లే గంగాధర్, కాలగిరి గంగ రెడ్డి, పబ్బా శివానందం, రాజ్ మోహన్, ఒజ్జల బుచ్చిరెడ్డి, సైఫోద్దీన్, ఎం.డి. ఎక్బాల్, యూసుఫ్, దేవేందర్ రావు, నారాయణ, శైలజ, విజయ లక్ష్మి, చంద్రమోహన్, కొండయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల చూపు... కాంగ్రెస్ వైపు...



జనగామ నవంబర్ 03 (ప్రజామంటలు): జనగామ పట్టణం విశ్వ కర్మ సంఘం నాయకులు 30 కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. పిసిసి మెంబర్ చెంచారపు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... బి.ఆర్.ఎస్ పార్టీ 10 సంవత్సరాలుగా ప్రజలను మాయమాటలతో విసుగు చెంది యువకులు ప్రజలు కాంగ్రెస్ పార్టీ వారికి భరోసా ఇస్తుందన్న నమ్మకంతోని కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా నాయకులు ఉడత రవి యాదవ్, ఆకుల లక్ష్మయ్య, పిట్టల సతీష్, బండారు శ్రీనివాస్, పిక్క బీరప్ప, నాంపెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగరావుకు మద్దత్తుగా కృష్ణారావు ప్రచారం

కోరుట్ల నవంబర్ 03 (ప్రజామంటలు): నియోజకవర్గం కేంద్రం అయిన కోరుట్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు కు ఓటు వేయాల్సిన ది గా నియోజకవర్గం నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఇంటింటిప్రచారం నిర్వహించారు. 2వ వార్డ్ లోని హాజీపూర మజీద్, ఎకుబ మజీద్ ఎఇమామ్ ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. కృష్ణారావు వెంట కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతమ్ రాజం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, ఉపాధ్యక్షులు నయీమ్ ముస్బిత్ స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఇతర పెద్దలు పాల్గొన్నారు.



## సిపిఎం అభ్యర్థులను గెలిపించండి



**జనగామ నవంబర్ 03 (ప్రజామంటలు):** అనునిత్యం ప్రజా సమస్యలు వాటి పరిష్కారం కోసం పోరాడే ఎర్రజెండా సిపిఎం అభ్యర్థులను ఈ ఎన్నికల్లో గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పోత్కనూరి ఉపేందర్, బోడ నరేందర్, భూక్యా చందు నాయక్ చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్, పార్టీ సీనియర్ నాయకులు గురజాల లక్ష్మీనరసింహ రెడ్డి, పార్టీ నాయకులు ఎ. సురేష్, ఎం. భవాని, బి. విష్ణు తదితరులు పాల్గొన్నారు.

### జగిత్యాల జిల్లా కేంద్రంలో స్వీప్ ఆధ్వర్యంలో

## మెప్మా సిబ్బందికి, మహిళలకు ఓటరు అవగాహన

### స్వీప్ జిల్లా నోడల్ అధికారి కె. లక్ష్మీనారాయణ




**జగిత్యాల నవంబర్ 03 (ప్రజామంటలు):** ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఓటు కీలకమైనదని అందుకే అర్హులైన వారందరు ఓటు హక్కును వినియోగించుకోవాలని జగిత్యాల జిల్లా స్వీప్ నోడల్ అధికారి కె. లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా స్వీప్ ఆధ్వర్యంలో మెప్మా సిబ్బందికి, మహిళలకు ఓటరు అవగాహన కార్యక్రమంను జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ యాస్మిన్ బాషా సూచనలతో జిల్లా నోడల్ అధికారి కె. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ సమావేశ మందిరంలో కమిషనర్ అనిల్ కుమార్, పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ మెప్మా ఏఓ శ్రీనివాస్ గౌడ్ నిర్వహణలో చేపట్టారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగం, సి-విజిల్, ఓటర్ హెల్ప్‌లైన్ ఆప్‌ల డౌన్‌లోడ్, 1950 తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణతో పాటుగా కమిషనర్ అనిల్ కుమార్, పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ మెప్మా ఏఓ శ్రీనివాస్ గౌడ్, స్వీప్ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, మెప్మా ఆర్పీలు రజిత, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు.

# ఎన్నికల వ్యయ వివరాలను పకడ్బందిగా నమోదు చేయాలి

### ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనల పై వచ్చే ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం

### అక్రమ నగదు, మద్యం పంపిణీ జర్గకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు

### పేడ్ న్యూస్, సోషల్ మీడియా లపై ఎక్కువ దృష్టి సారించాలి

### ఎన్నికల వ్యయ పరిశీలకులు కౌశిక్ రాయ్




**భూపాలపల్లి ప్రతినిధి నవంబర్ 03 (ప్రజామంటలు):** భూపాల్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎన్నికల వివరాలను పకడ్బందీగా నిబంధన మేరకు నమోదు చేయాలని భూపాలపల్లి ఎన్నికల పరిశీలకులు కౌశిక్ రాయ్ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో భూపాలపల్లి ఎన్నికల వ్యయ పరిశీలకులు కౌశిక్ రాయ్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా తో కలిసి భూపాలపల్లి నియోజకవర్గ ఎన్నికల వ్యయ వివరాల నమో దు పై సంబంధిత అధికారులతో రి వ్యూ నిర్వహించారు. భూపాల్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలు, అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల నమోదు కోసం ఏర్పాటుచేసిన బృందాలు వాటి పనితీరు తదితర అంశాలను జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా వివరించారు. భూపాలపల్లి ఎన్నికల వ్యయ పరిశీలకులు కౌశిక్ రాయ్ మాట్లాడుతూ.... ఎన్నికల ఖర్చులు నమోదు కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు స్టాటిక్ సర్వేలన్సు బృందాలు, వీడియో సర్వేలెన్సు బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలు పకడ్బందిగా విధులు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల సమయంలో నగదు బంగారం, వస్తువుల పంపిణీ జరగకుండా అప్రమత్తంగా ఉండాలని క్షేత్రస్థాయి నుంచి వచ్చే ఫిర్యాదులు సమాచారం తీసుకుంటూ పకడ్బందీగా విధులు నిర్వహించాలని అన్నారు. సహాయ వ్యయ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, సహాయ వ్యయ పరి శీలన అధికారులు రిటర్నింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. అనుమానాస్పద బ్యాంక్ లావాదేవీ లు, 10 లక్షల కంటే మించి నగదు జమ, ఉపసంహరణ, ఆన్లైన్ ద్వారా మల్టిపుల్ లావా దేవీ లపై పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఇన్ కం టాక్స్, వాణిజ్య పన్నుల శాఖ, వ్యయ పరిశీలన శాఖలు ఎన్నికల వ్యయం నమోదులో సమన్వయముతో పని చేయాలని అన్నారు. ఎంసిఎంసి కమిటీ ద్వారా రోజువారి దినపత్రికల్లో, లోకల్ ఛానెల్ లో వచ్చే పేడ్ న్యూస్ పై దృష్టి సారించాలన్నారు. సోషల్ మీడి యా పై పటిష్టంగా ఉంచాలన్నారు. రాజకీయ సభ్యులు సమావేశాలు నిర్వహించే సమయంలో వాటిని నిశితంగా రికార్డ్ చేయాలని, అక్కడ వినియోగించే ప్రతి వస్తు రేట్ చార్ట్ ప్రకారం అభ్యర్థి ఎన్నికల ఖాతాలో నమోదు జరిగే విధంగా నిబంధనలో మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపా రు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఆర్.డి.ఓ. రమాదేవి, డిఎస్పీ రాములు, ఐటి అధికారులు, వి.ఎస్.టి., ఎస్.ఎస్.టి., ఎం.సి.సి., ఎం.సి.ఎం.సి, టీమ్ ల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష




**జగిత్యాల నవంబర్ 03 (ప్రజామంటలు):** ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.... ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు గాను సంబంధిత అధికారులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. సి. విజిల్ యాప్ ద్వారా 140 వరకు ఫిర్యాదులు అందాయని వాటిలో 125 వరకు యదార్థమైనవి అని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 15 వేల మంది సి. విజిల్ యాప్ ను డౌన్లోడ్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 785 పోలింగ్ స్టేషన్లు జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గ మలోకలిపి ఏర్పాటు చేసినట్లు తెలిపారు 1950 హెల్ప్ లైన్ వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి జిల్లా స్థాయిలో 8 చెక్ పోస్టులు ,అంతర్ జిల్లా స్థాయిలో 7 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే రెండు కంపెనీల బిఎస్ఎఫ్ జవాన్లు పనిచేస్తున్నారని ఇంకా తొమ్మిది కంపెనీల బలగాలు రానున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లేక తరలిస్తున్న గోల్డ్, లిక్కర్లు. దుస్తులు, వివిధ వస్తువుల రూపంలో 3.65 కోట్ల విలువ గలవి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత తదితరులు పాల్గొన్నారు.

# అధికారంలోకి రాగానే గల్ఫ్ పాలసీని అమలు చేస్తాం

### పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

### జీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన డా. షేక్ చాంద్ పాషా


**జగిత్యాల నవంబర్ 03 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గల్ఫ్ పాలసీని అమలు చేసి తీరుతామని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ.... గల్ఫ్ కార్మికుల, బాధితుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందిస్తామని అన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ఎన్అర్ఐ పాలసీ అమలు చేసి రూ.500 కోట్ల నిధులు కేటాయిస్తామని, ప్రత్యేక శాఖ ఏర్పాటు దిశగా ముందుకు వెళ్తామని జీవన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గల్ఫ్ సంక్షేమం కొరకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తానని, బాధిత కుటుంబలకు అండగా నిలుస్తామని హామీ ఇవ్వడం పట్ల టిపీసిసి ఎన్ అర్ ఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ షేక్ చాంద్ పాషా కృతజ్ఞతలు తెలిపారు. గల్ఫ్ కార్మికుల, బాధిత కుటుంబాల సంక్షేమం కొరకు పాటుపడుతామన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపేందుకు శనివారం ఉదయం 11:00 గంటలకు పట్టణంలోని ఇందిరా భవన్ కు రావాలని టిపీసిసి ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ షేక్ చాంద్ పాషా (9949321330) పిలుపునిచ్చారు.



## మానవ తప్పిదమే..?

### మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజ్ ఘటనపై కేంద్ర కమిటీ నివేదిక


### నివేదికలో పలు ఆసక్తికర అంశాలు



**భూపాలపల్లి ప్రతినిధి నవంబర్ 03 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మేడిగడ్డ (కాళేశ్వరం) బ్యారేజ్ మేడి పండును మరిపిస్తోంది. రెండువేల పందొమ్మిదిలో ప్రారంభించిన ఈ బ్యారేజ్ కేవలం నాలుగు సంవత్సరాలకే కుంగిపోయే పరిస్థితికి చేరుకుంది. గతనెల 21న బ్యారేజ్ లోని 7వ బ్లాక్ వద్ద 20 వ పిల్లర్ వద్ద ఒక అడుగు మేర కుంగి పోయింది. ఈ ఘటనపై కేంద్ర జల మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం బ్యారేజ్ వద్ద కుంగిన ప్రదేశాన్ని పరిశీలించి పలు అంశాలతో కూడిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించగా ఆ నివేదికలో పలు ఆసక్తికర అంశాలు చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. బృందం పర్యటన సందర్భంగా మొత్తం 20 అంశాలను ప్రాజెక్టు అధికారులను అడుగగా ఆ సమయంలో కేవలం 3 అంశాలపై మాత్రమే సమాచారం ఇచ్చి మిగతా సమాచారాన్ని తరువాత అందచేసినట్లు సమాచారం. అధికారులు ఇచ్చిన, సంఘటన ప్రదేశం లో చూసిన పలు అంశాలను క్రోడీకరిస్తూ బృందం సభ్యులు ఇచ్చిన నివేదికలో ప్రాజెక్టు నిర్మాణము లోనే తప్పిదాలు జరిగినట్టు, ప్లానింగ్, డిజైనింగ్ లతో పాటు ఆపరేషన్ మెయింటనెన్స్ లో అధికారులు విఫలమైనట్టు, ఆ తప్పిదం వల్ల బ్యారేజ్ పియర్ కుంగినట్టు, కుంగిన పియర్ ను మరమ్మత్తులు చేసే వీలు లేదని కొత్తగా నిర్మించాల్సి ఉందని నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం. కేవలం లక్ష్మి బరేజ్ మాత్రమే కాదు మిగతా బ్యారేజ్ లను కూడా యుద్ధ ప్రాధిపదికన పరిశీలించాలని లేని పక్షంలో ప్రాజెక్ట్ మొత్తం నిరుపయోగంగా మారుతుందని సూచించినట్టు తెలుస్తోంది.

# ఆ విషయాన్ని మా అన్నయ్యనే అడగండి : కార్తీ

కార్తి హీరోగా నటించిన 25వ చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వం వహించిన ఈ థ్రిల్లర్‌ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ ఆర్ ప్రభు నిర్మించారు. అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తోంది. దీపావళి కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా కార్తి విలేకర్లతో మాట్లాడారు. 'జపాన్' ట్రూ స్టోరీ కాదు. కానీ వాస్తవ సంఘటనల స్ఫూర్తి కనిపిస్తుంది. దర్శకుడు రిపోర్ట్ నుంచి డైరెక్టర్ అయ్యారు. ఆయన చూసిన అనుభవాలు ఈ చిత్రంలో ఉన్నాయి. ఆయన దర్శకత్వం వహించిన 'జోకర్' సినిమాకి నేషనల్ అవార్డ్ వచ్చింది. కొత్త అనుభూతిని కలిగించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా స్క్రిప్ట్ చదువుతున్నప్పుడే ఇదే అవుట్ అఫ్ ది బాక్స్ మూవీ అనిపించింది. మాస్, ఫన్ అన్నీ ఎలిమెంట్స్ వున్న యూనివర్సల్ ఎంటర్టైనర్‌ఇది. ఇందులో ప్రతి సన్నివేశం చాలా కొత్తగా ఒరిజినల్‌గా వుంటుంది. సినిమా చూస్తే ఈ టైటిల్ ఎందుకు పెట్టామో తెలుస్తుంది. ఈ చిత్రలో మంచి సెటైర్ వుంది. డార్క్ కామెడీ బాగా పండింది. ఊపిరి సినిమాకి తమిళ వెర్షన్ డైలాగులు రాసింది ఆయనే. అప్పుడే ఆయన హ్యూమర్ చూసి షాక్ అయ్యాను. ఇందులో ఆ హ్యూమర్ ప్రేక్షకులకు సర్ ప్రైజ్ ఇస్తుంది. చాలా రోజుల తర్వాత మాస్‌తోపాటు హ్యూమర్ సెటైర్ వున్న డిఫరెంట్ రోల్ చేశా. నేటి సమాజాన్ని రిఫ్లెక్ట్ చేసే కథ ఇది. యూనివర్సల్ ఆడియన్స్‌కి ప్రజెంట్ చేయడానికే చాలా ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులతో పని చేశాం. ఎస్ రవివర్మన్ అద్భుతమైన విజువల్ ట్రీట్మెంట్ ఇచ్చారు. అలాగే జీవీ ప్రకాష్ మ్యూజిక్‌తో మరో స్థాయికి తీసుకెళ్లారు. జపాన్ చాలా బలమైన కథ. దీనికి సీక్వెల్, ప్రీక్వెల్ ఎదో ఒకటివుండాలని క్లైమాక్స్‌కి ముందే దర్శకుడితో చెప్పాను. జపాన్ పాత్రను మళ్లీ చేయాలని ఉంది. 'సూదుకవ్వం' చిత్ర దర్శకుడితో ఓ సినిమా చేస్తున్నాను. అలాగే 96 దర్శకుడు ప్రేమ్ కుమార్ తో ఓ సినిమా చేస్తున్నాను. ఈ రెండు దేనికవే ప్రత్యేకం. అలాగే ఖైదీ 2, సర్దార్ 2 కూడా వున్నాయి. ప్రస్తుతం ఖైదీ 2 చిత్రం కోసం ఎదురుచూస్తున్నా. చర్చలు జరుగుతున్నాయి. రోలెక్స్ గురించి ప్రేక్షకుల్లో చాలా అంచనాలున్నాయి. దీని గురించి అన్నయ్య (సూర్య), దర్శకుడు లోకేష్ కనకరాజ్‌ని అడగాలి( నవ్వుతూ).



## నాలుగు పదుల వయసులో ఉన్నా తరగని అందం

నాలుగు పదుల వయసులో ఉన్నా తరగని అందం త్రిషది. ప్రస్తుతం కోలీవుడ్‌ల మంచి రైజింగ్‌లో ఉన్న నటి ఎవరంటే త్రిష పేరే చెబుతారు. దాదాపు 25 ఏళ్లగా దక్షిణాదిన కథానాయికగా కొనసాగుతుంది. విజయవంతమైన చిత్రాలు తన ఖాతాలో వేసుకుంది. తాజాగా విజయ్‌తో 'లియో' (శ్రీవనీ) చిత్రంలో సందడి చేసింది. విడుదలై రెండు వారాలు గడుస్తున్నా.. మంచి వసూళ్లు రాబడుతోంది. తాజాగా చెన్నైలో జరిగిన లియో చిత్ర విజయోత్సవ వేడుకలో త్రిష మాట్లాడారు. దర్శకుడు ఈ కథను రెండున్నర గంటలపాటు నెరేట్ చేసిన తీరు తనను ఆశ్చర్యానికి గుర్తు చేసిందని అన్నారు. త్రిష మాట్లాడుతూ "లోకేశ్ కనకరాజ్ నన్ను కలిసినప్పుడు ఏం చెప్పారో అదే తెరపై ఆవిష్కరించారు. విజయ్ సరసన నటించడం మరిచిపోలేని అనుభవం. స్కూల్లో ఫ్రెండ్స్ కొన్నేళ్ల తర్వాత కలి?స్తే ఎలా ఉంటుందో అలాంటి అనుభూతి నాకు కలిగింది. నా కెరీర్‌లో ఎక్కువ చిత్రాలు చేసింది విజయ్‌తోనే. విజయ్ నెమ్మదితనం, సింప్లిసిటీ ఆయన విజయానికి కారణం. నా స్నేహితులు విజయ్ మళ్లీ ఎప్పుడు సినిమా చేస్తావని కలిసిన ప్రతిసారీ అడుగుతారు. లియోతో అది ఇన్నాళ్లకు జరిగింది. 15 ఏళ్ల తర్వాత కూడా మా కింబినేషన సక్సెస్‌ఫుల్‌గా వర్కవుట్ అయింది. హీరోయిన్స్ కి పతనాలు ఎక్కువగా ఉంటాయి. అయినప్పటికీ అన్నివేళలా సంతోషంగా ఉండాలి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com